


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 20-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 270 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఏపీలో మరో కొత్తస్కీమ్..

# వైఎస్సార్ నవోదయం



- రజకులకు, నాయి బ్రాహ్మణులకు, టైలర్లకు ఆర్థిక సహాయం
- పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే
- 2018 నాటి ఏపీఈడీబీ చట్టం తొలగింపు
- కీలక నిర్ణయలు తీసుకున్న ఏపీ కేబినెట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం భేటీ అయిన మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో 50శాతం అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఈ విప్లవాత్మక చట్టానికి ప్రభుత్వం ఈ సమావేశాల్లోనే శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో చట్టం, ముసాయిదా బిల్లుకు శుక్రవారం కేబినెట్ అంగీకారం తెలిపింది. అలాగే బీసీలకు సీఎం జగన్ మరో బంపర్ బొనాంజాను ప్రకటించారు. రజక, నాయి బ్రాహ్మణ, టైలర్లకు ఆర్థిక సహాయంగా ఏడాదికి రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ ప్రాతిపాదనకు కేబినెట్ అంగీకారం తెలిపింది. దీని ద్వారా పాదయాత్రలో వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లయింది.

అలాగే నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా ఏపీ ప్రభుత్వం గొప్ప ముందడుగు వేసింది. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చే విధంగా చట్టాన్ని రూపొందించాలని నిర్ణయించింది. పరిశ్రమల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన వారికి ఉపాధి అవకాశాల కోసం జీవనోపాధి కల్పించే విధంగా చట్టం చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది.

**2018 నాటి ఏపీఈడీబీ చట్టం తొలగింపు..**

టీడీపీ ప్రభుత్వం 2018లో రూపొందించిన ఏపీఈడీబీ చట్టాన్ని తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. దాని స్థానంలో కొత్తగా ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ మానిటరింగ్ యాక్ట్‌ను రూపొందిస్తూ.. 2019 ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ఆకర్షణ, బ్రాండింగ్, పర్యవేక్షణ, ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల సమీకరణ, పరిశ్రమల కాలుష్యంపై నియంత్రణ, విధానాల రూపకల్పన లక్ష్యాలుగా చట్టాన్ని రూపొందించారు. బోర్డు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి జగన్‌తో సహా.. మొత్తం 7గురు డైరెక్టర్లకు దీనిలో స్థానం కల్పించారు. డైరెక్టర్లుగా ఆర్థిక, పరిశ్రమల శాఖల మంత్రులు, చీఫ్ సెక్రటరీ తదితరులు ఉండనున్నారు.

ఏపీఐపీఎంఏలో శాశ్వత ప్రత్యేక సలహామండలిగా ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు, వ్యాపార దిగ్గజాలు, ఆర్థిక నిపుణులులకు అవకాశం కల్పించారు. ప్రధాన కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేస్తుండగా.. మరో కార్యాలయం హైదరాబాద్‌లో నిర్మించనున్నారు.

యువ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహించి.. వారికి ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు. గతంలో ఏపీఈడీబీలో అవసరానికి మించి భారీ సంఖ్యలో పదవులు, పక్షపాత ధోరణి, అవినీతి, విదేశీ పర్యటనల పేరిట దుబారా ఖర్చులు చేసినట్లు కేబినెట్ తెలిపింది.

**వైఎస్సార్ నవోదయం..**

సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు ఊరటగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రకటించింది. 'వైఎస్సార్ నవోదయం' పథకం కింద కొత్త పథకానికి రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. మూడేళ్లుగా తరువాయి 2లో..

## ఎంత దోచారో 15 రోజుల్లో బయటికొస్తాయ్

### ముఖ్యమంత్రి జగన్



అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గత మూడు రోజులుగా చర్చ జరుగుతూనే ఉందని, సభలో ప్రతి రోజూ జలవనరుల మంత్రి ఈ అంశంపై చర్చిస్తూనే ఉన్నారని ఏపీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు అంతా కుంభకోణాల మయమైందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక కమిటీ అధ్యయనం చేస్తోందని చెప్పారు. ఇటీవలే పోలవరం ప్రాజెక్టును పరిశీలించి వచ్చానని, నాలుగు నెలలుగా పూర్తిగా పనులు ఆగిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నవంబర్ నాటికి ప్రారంభించి 2021 జూన్ నాటికి నీళ్లు ఇవ్వాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు.

బిడ్డింగ్‌లో ఎవరు ఎంత తక్కువకు కోట్ చేస్తారో వాళ్లకే అప్పగిస్తామని జగన్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిధులపై రీ బిడ్డింగ్ వేస్తే రూ.6,500 కోట్ల పనుల్లోనే 15 నుంచి 20 శాతం మధ్య మిగిలే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నట్లు జగన్ అసెంబ్లీలో వెల్లడించారు. నామినేషన్ పద్ధతిలో ఇష్టమొచ్చిన గుత్తేదారును తీసుకొచ్చారు. యనమల వియ్యంకుడు కూడా సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. ఎంతటి దారుణమైన కుంభకోణాలు జరుగుతున్నాయో చూశాం. పనులు ప్రారంభించకుండానే రూ.724 కోట్లు అడ్వాన్స్ కింద కట్టబెట్టారు. పోలవరంలో ఎంత దోచారో మరో 15 రోజుల్లో బయటికొస్తాయి. ఈ ప్రాజెక్టు విపరీతమైన కుంభకోణాలతో నిండిపోయింది అని సీఎం జగన్ ఆరోపించారు.

## కర్ణాటక అసెంబ్లీ మరోసారి వాయిదా

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ మరోసారి వాయిదా పడింది. విశ్వాస పరీక్షకు సంబంధించి ఎలాంటి ఓటింగ్ జరగకుండానే సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు విశ్వాస తీర్మానంపై చర్చను కొనసాగించనున్నారు. అనంతరం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. అంతకుముందు భారతీయ జనతా పార్టీ సభ్యులు బలపరీక్షను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవాళ నిర్వహించాల్సిందేనని పట్టుబట్టారు. సభలో నిల్చుని ఆందోళనకు దిగారు. వారి ఆందోళన నడుమ సభను స్పీకర్ వాయిదా వేశారు.

ఈ ఉదయం నుంచి సభను వాయిదా వేసే దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగా.. ఎట్టి పరిస్థితుల్లోనూ శుక్రవారమే బలపరీక్ష చేపట్టాలంటూ భాజపా సభ్యులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు, విశ్వాస పరీక్షపై ప్రతి ఒక్కరూ మాట్లాడేలా స్పీకర్ అవకాశం కల్పించారు. దీంతో దీనిపై చర్చ ముగియాలంటే రెండు లేదా మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. అదే సమయంలో సభను సోమవారానికి వాయిదా తరువాయి 2లో..

## మెగాస్టార్ చిరంజీవి మమ్మల్ని సంప్రదించలేదు



అమరావతి : బీజేపీలో చేరే విషయమై మెగాస్టార్ చిరంజీవి తమతో సంప్రదింపులు జరపలేదని, జాతీయ స్థాయి నేతలతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారేమో తెలియదని ఏపీ బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 11తరువాత పార్టీలో కీలక మార్పులు, చేర్పులు ఉంటాయని వెల్లడించారు. టీడీపీ నుంచి చాలా మంది ఎమ్మెల్సీలు బీజేపీతో టచ్‌లో తరువాయి 2లో..

### వి.ఎం.ఆర్.డి.ఏ ప్రతిష్టను

## పెంచేందుకు కృషి చేస్తా

- తొలి ఛైర్పర్సన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ద్రోణంరాజు శ్రీనివాస రావు
- వి ఎం ఆర్ డి ఏ అధికారుల ఘన స్వాగతం
- ప్రభుత్వ ఉద్యోగులకు 27 శాతం ఐ.ఆర్. ఫైల్ పై తొలి సంతకం
- అజమాయషి ఉండదు... స్నేహపూర్వకంగా పనిచేద్దాం



విశాఖపట్నం : వి ఎం ఆర్ డి ఏ తొలి ఛైర్పర్సన్ గా ద్రోణంరాజు శ్రీనివాస రావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీఎం ఆర్‌డిఏ ఇన్చార్జ్ కమిషనర్ డా.జి.సృజన, అధికారులు , కుటుంభ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ సృజన అధ్వర్యంలో బాధ్యతలను స్వీకరిస్తూ ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు తరువాయి 2లో..

## రిపీట్ కావొద్దు



న్యూఢిల్లీ : పార్లమెంటుకు హాజరు కాకుండా సభా సమయాన్ని వృథా చేశారంటూ కేంద్ర పశు సంవర్ధక సహాయ శాఖా మంత్రి సంజీవ్ కుమార్ బలయాన్‌పై ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఈ తప్పిదం పునరావృతం కావొద్దని హెచ్చరించారు. బుధవారం నాటి ఎజెండాలో మంత్రి పేరు ఉన్నప్పటికీ ఆయన సభకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సభాపతి స్థానంలో ఉన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ...' మంత్రి గారు.. మొన్నటి ఎజెండాలో మీ పేరు ఉంది. కానీ తరువాయి 2లో..




### పిడుగుపడి

## 7గురు చిన్నారుల మృతి

పట్నా: బిహార్‌లో పిడుగుపాటుకు గురై ఏడుగురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. సెంట్రల్ బిహార్ జిల్లా నవాడలో ఈ ఘోరం చోటు చేసుకుంది. కొందరు పిల్లలు చెట్టు కింద ఆడుకుంటుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగుపడింది. ఈ ఘటనలో ఏడుగురు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు పరుగు పరుగున సంఘటనా స్థలానికి వచ్చారు. గాయపడని చిన్నారులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటివరకూ ఆడుకుంటూ విగతజీవులుగా మారిన పిల్లలను చూసి, వారి తల్లిదండ్రులు, బంధుల రోదనలతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది. గాయపడిన వారిని సర్దార్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సబ్ డివిజనల్ ఆఫీసర్ అనుకుమార్ తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులు ఒక్కొక్కరికి రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనలో చనిపోయిన చిన్నారులందరూ 15 సంవత్సరాలలోపు వాళ్లు కావడం గమనార్హం.



# వి.ఎం.ఆర్.డి.ఏ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తా



రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 27 శాతం ఐ.ఆర్. ఫైల్ పై తొలి సంతకం చేశారు. ఉద్యోగుల ఈ నెల జీతలలో 27 శాతం ఐ.ఆర్ కలుస్తుందని,

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ మంజూరు చేసిన ఐ.ఆర్ ఫైల్ కు తొలి సంతకం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా రహదారుల అభివృద్ధిపై , జి వి ఎం సి, పోలీసు శాఖల సమన్వయంతో హై వే లలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించే అంశానికి చెందిన ఫైల్ పై రెండవ సంతకం చేశారు.

**అజమాయషి ఉండదు...స్నేహపూర్వకంగా పనిచేద్దాం:** వి ఎం ఆర్ డి ఏ ఉద్యోగులతో ఛైర్పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉద్యోగులపై అజమాయిషి ఉండదని, పరస్పర సహకారం తో స్నేహపూర్వక వాతావరణం లో అందరం కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. వుడా కు తన తండ్రి 40 యేళ్ళ క్రితం తొలి ఛైర్మన్ గా పనిచేస్తూ ఎంతో అభ్వివృద్ధిని చేశారని, వి ఎం ఆర్ డి ఏ సంస్థ తొలి చైర్ పర్సన్ గా తను నియమించబడినందుకు అదృష్టంగా భావిస్తూ, వి ఎం ఆర్ డి ఏ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళు గా చేసుకొని పని చేస్తున్నారని, వారి అడుగుజాడల్లో పని చేసి విశాఖ పట్టణాన్ని రాష్ట్రం లోనే ఉన్నతంగా, ఒక పారిశ్రామిక హబ్ గా, ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాడానికి శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. వి ఎం ఆర్ డి ఏ కమిషనర్ డా. జి. సృజన మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఏ వంటి ప్రతిష్టాత్మక సంస్థకు మంచి వ్యక్తిగా

ప్రజల్లో గుర్తింపు ఉన్న వ్యక్తి చైర్ పర్సన్ గా రావడంవలన, ఈ సంస్థ మరింత ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు జిల్లాల్లో ఉన్న ఈ సంస్థను అభివృద్ధి పథం లో నడపడానికి అధికారులంతా సహకరిస్తామని తెలిపారు.

**రాజకీయ పునర్జన్మ నిచ్చిన ముఖ్యమంత్రికి ఋణపడి ఉంటా:**

అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినప్పటికి తన మీద నమ్మకం తో ప్రతిష్టాత్మకమైన చైర్ పర్సన్ పదివిని తనకు ఇచ్చి, రాజకీయంగా పునర్జన్మనిచ్చిన ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి ఋణపడి ఉంటానని అన్నారు. తనపై ఉంచిన బాధ్యతను జిల్లా మంత్రి శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాస రావు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గార్ల సహకారం తో , సమన్వయం తో విజయవంతంగా నిర్వహిస్తానని అన్నారు. వి ఎం ఆర్ డి ఏ ఇప్పటికే చేపట్టిన ఎన్.ఏ.డి పై వంతెన పనులను వేగంగా జరిగేలా చూస్తానని అన్నారు. బీచ్ ఫ్రంట్ ప్రాజెక్టు ను ప్రజల ఆకాంక్షాల మేరకు ముందుకు తీసుకు వెళ్తామని, కైలాసగిరి, ముడసర్లోవ , యారాడ వద్ద అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపనలు చేసి విశాఖపట్టణాన్ని సుందరంగా, పర్యాటకుల స్వర్గధామంగా చేస్తామని తెలిపారు. పెండింగ్ అంశాలపై దృష్టి పెట్టి అధికారులతో సమీక్షించుకొని వి ఎం ఆర్ డి ఏ ను ప్రగతిపథం లో నడపడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో వి ఎం ఆర్ డి ఏ సెక్రెటరీ ఏ. శ్రీనివాస్, అధికారులు, వుడా మాజీ ఛైర్మన్ రాజు, పలువురు పార్టీ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసిలో ఎన్ ఐటిఐ అయోగ్



పరవాడ:ఎన్టీపిసి సింహాద్రిలో ఫ్లైయాష్ మరియు ఎర్రమట్టినుండి అరుదైన మూలకాలను వెలికితీసేందుకు టెక్నాలజీల స్ధాపనపై ఎన్ ఐటిఐయోగపై (మినరల్ డివిజన్ )కమిటి7వ సమావేశం శుక్రవారము జరిగింది.ఈసమావేశానికి డాక్టర్ పి.కె.పట్టల్ ,ఎక్స్ పీఅర్ శాస్త్రవేత్త బార్క్ చైర్మన్ (ఫ్లైయాస్ )మరియు డాక్టర్ అర్ .ఎన్ .పత్రా,ఎక్స్ సిఎమ్ డి ఐరియల్ చైర్మన్ (రెడ్ మడ్ )పోల్గోన్నారు. ఈసమావేశానికిఎన్ టిపిసి కార్పోరేట్ యాష్ మెనేజ్ మెంట్ విభాగం సిఅర్ శరవన్ భన్ ,డిప్యూటిఅడ్వయిజర్ (ఖనిజాలు) నీతి అయోగ్ మరియు ఎన్టీపిసి సింహద్రిని సమన్వయపరిచారు.ఈసమావేశంలో ఎన్ ఐటి ఐ యోగ్ ఎన్టీపిసి లిమిటెడ్ టాటా రిసర్స్ డిజైన్ దేవ్ నుండి సభ్యులుసెంటర్ ,పున్ ,హిండాల్కో,నాల్కో, వేదాంవ, అల్యూమినా, ఐఎమ్ టి,బార్క్ ,స్టార్ డ్రెస్ ప్రవేట్ లిమిటిడ్ ప్రతినిదులు పోల్గోన్నారు. చీఫ్ జనరల్ మేనజర్ వి.సుదర్శన్ బాబు నీతిఅయోగ్ కమిటికి స్వాగతంపలికారు. సమావేశానికి ఎన్టీపిసి సింహద్రిని ఎన్నికునేందుకు గానూ కృతజ్ఞతలు తెలియజేసారు.

అల్యూమినియం మరియు పవర్ ఇండిస్ట్రీనుండి వచ్చే రెడ్ మెడ్ మరియు ఫ్లైయాస్ నుండి వ్యర్ధఅవిశేషాలుమరియు ఖనిజాలుమరియు అరుదైన మూలకాలు యొక్కవర్గీకరణప్రయోజనం మరియు శుద్ధీకరణ సాంకేతికాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనజర్ (యస్ యస్ సి )ఎ.కె.శ్రీవాస్తవ,ఎజిఎం యస్ .యస్ . రావు తథితర్లు పోల్గోన్నారు.

# మత్స్యకారులకు బడ్జెట్ కేటాయింపుపై హర్షం




విశాఖపట్నం : రాష్ట్ర బడ్జెట్లో మత్స్యకారులకు రూ. 100 కోట్ల రూపాయలు బడ్జెట్ మంజూరు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో బుద్ధ నీల కంఠం మాట్లాడుతూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులను అవమానపరుస్తూ వారి సమస్యలు పట్టించు కోకుండా తొక్క తీస్తా తోలు తీస్తా పరుష పదజాలంతో దూషించడమే కాకుండా గత ఐదేళ్లలో తమ కష్టాలను విన కుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో మత్స్యకారుల కష్టాలను చూసి జగన్ అధికారం లోకి రాగానే మత్స్యకార కులానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక మత్స్యకార రూ.100 కోట్లు బడ్జెట్ లో కేటాయించి తన ఉన్నత మనసును చాటుకున్నారని కొనియాడారు. సమైక్య అధ్యక్షుడు వి.జానకి రాము మాట్లాడుతూ మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 56 రోజులు నిరాహార దీక్షలు చేస్తే చంద్ర బాబు అసలు పట్టించుకోలేదని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని జిల్లా మంత్రి అవంతి శ్రీని వాస రావు ప్రస్తావించి, ఎన్నికల ఓట్లు కోసం హామీలు గుప్పించిన చంద్రబాబును అసెంబ్లీలో నిలదీసి సరైనరీతిలో సమాధానం చెప్పారని దానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గత రెండేళ్లుగా మత్స్యకారులకు డీజిల్ డిస్కౌంట్ బకాయిలను టిడిపి ప్రభుత్వం చెల్లించలేదని వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విషయాన్ని మత్స్యశాఖ మంత్రి మోపిదేవి

రమణకు తెలియజేయగా కార్పొరేషన్ బంకులలో డీజిల్ కొట్టిం చుకున్న వెంటనే రాయితీ విడుదల అయ్యే విధంగా కార్యాచరణ రూపొందిస్తా మని తెలియ జేశారని దీనికి బోటు యజమానులు, మత్స్య కారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

హుదూద్ తుఫాన్లో నష్టపో యిన ఫిషింగ్ హార్బర్ ను 40 కోట్ల రూపాయలతో నవీకరణ చేయ

మత్స్య కారులకు వేట నిషేధ కాలంలో ఇచ్చే పరిహారం 4 వేలు నుండి 10 వేల రూపాయలకు పెంచి నందుకు వైకాపా ప్రభుత్వ సీఎం జగన్మోహన్ రెడ్డికి మత్స్యకారులు ఎప్పుడు రుణపడి ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో తీరప్రాంత కంటూ ముచ్చు, తాతారావు, పీరు పల్లి రాజశేఖర్, కులు వాడరేవు సింహాచలం, నూకరాజు, రాము, బడే , కొండబాబు అమర్నాథ్ పాల్గొన్నారు.

# మాక్ సెంటర్ లో టిబి అవగాహన సదస్సు




సింథియా: పారిశ్రామికప్రాంతం శ్రీహరిపురం మాక్ సెంటర్ వద్ద ప్రతీ నెల 3వ శుక్రవారం జరుగే "ఎంటీ టిబి డే" సంధర్భంగా మాక్ సెంటర్ వైద్యాదికారిని(చిన్నపిల్లల వైద్యనిపుణులు) డా.ప్రత్యూష అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో టిబి వ్యాది లక్షణాలు, వ్యాధి నిరోధక చర్యలు, చికిత్సవిధానాం గురించి వివరించారు. వ్యాది పై అపోహాలను తొలగించారు. అంతేకాకుండా పోషకాహార నిమిత్తం ప్రభుత్వం రూ.500లు వ్యాధి గ్రస్తునికి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యన్టిసిపి సిబ్బంది ఎటిఎస్ ఎస్.గోవింద్, టిబిహెచ్వి ఏ.శ్రీదేది, మాక్ సెంటర్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్లు




సింథియా: మల్కాపురం జోన్ విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశ్రామికప్రాంతం త్రినాధపురంలో శారదా ట్యూషన్ సెంటర్, అల్లూరిసీతారామరాజు ట్యూషన్ సెంటర్, శ్రీహరిపురం గుల్లలపాలెంలో వైదాడ ధర్మారం ట్యూషన్ సెంటర్, జీవీయంసీ 49వ వార్డులో గుడివాడ అప్పన్న ట్యూషన్ సెంటర్లను ఏర్పాటుచేసారు. ఈ సంధర్భగా నిర్వాహాకులు విసిసి నాయకులు ఇ.అరుణా, ఎస్విఎస్సుదారాణి మాట్లాడుతూ విధ్యార్ధులను మంచి పౌరులుగా తీర్చిదిదేద్దందుకు ఈ ట్యూషన్ సెంటర్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ట్యూషన్ సెంటర్లలో 1వ తరగతినుంచి 7వ తరగతివరకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వీరికి డిగ్రీ చదివిన అత్తుత్తమ ప్రతిభకల్గిన వారితో శిక్షణ నివ్వడం జరుగుతుందని తెలిపారు. అందుకు బి.ప్రవీణరాణి ని నియమించినట్లు తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం 5గం.నుంచి 7గం.వరకు ఉంటుందని అన్నారు. అయితే దీనికి నామమాత్రపు ఫీజు రూ. 50చొప్పు నెలకు వసూలు చేయడం జరుగుతుందని అన్నారు.

ఇది పేద మద్యతరగతి పిల్లలకు ఎంతో ఉపయోగం మని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇ.చాతుర్య, రక్షిత, తేజ,ఎస్.చిన్మయ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## జీవీయంసీ 50వ వార్డులో జోన్-5జెడ్సీశ్రీధర్ పర్యటన

గాజువాక: పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 50వ వార్డులో పలు ప్రాంతాలలో శుక్రవారం జోన్-5 జెడ్సీ శ్రీధర్ పర్యటించారు. వార్డులోని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వార్డులోని తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, కళ్యాణమండపం ఏర్పాటు, అలాగే వాంబే కాలనీ నుంచి వచ్చేనీరు, వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక, రోడ్డుపైనే మురుగు చేరడంతో ఆనారోగ్యపాలవు తున్నామని, చాలా ఇబ్బందులకు గురౌవుతున్నామని, తదితర సమస్యలను వార్డు నాయకులు దొడ్డిరమణ, మంజుల జెడ్సీ దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే గాజువాక పర్యటనకు వచ్చిన పర్యాటక మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్ళామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## ఏపీలో మరో కొత్తస్కీమ్.. వైఎస్సార్ నవోదయం

ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఎంఎస్ఎంఈలను ఆదుకునేలా ఈ స్కీంను రూపొందించారు. జిల్లాల వారీగా 86వేల ఎంఎస్ఎంఈల ఖాతాల గుర్తించనున్నారు. రూ.4వేల కోట్ల రుణాలు ఒన్టైం రీస్ట్రక్చర్ ఎన్పీఏలుగా మారకుండా, ఖాతాలు స్తంభించకుండా అవకాశం కల్పించనున్నారు. ఎంఎస్ఎంఈలకు మరింత రుణం, తక్షణ పెట్టుబడికి అవకాశం ఉండే విధంగా దీనిని రూపొందించనున్నారు. రానున్న 9 నెలల వ్యవధిలోనే ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం మరో భారీ నిర్ణయం తీసుకుంది. నామినేషన్ పద్ధతిలో ఇచ్చే కాంట్రాక్టులు, సర్వీసు కాంట్రాక్టుల్లో 50 శాతం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకే దక్కే విధంగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ చట్టం ద్వారా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా ఉంటామని పాదయాత్రలో ప్రకటించిన మాటకు కట్టుబడి ఉంటున్నానని సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి మరోసారి నిరూపించారు.

## కర్ణాటక అసెంబ్లీ మరోసారి వాయిదా

వేయాలని సంకీర్ణ నేతలు కోరారు. అటు వైపు తక్షణమే బల పరీక్ష నిర్వహించేలా గవర్నర్ చేత భాజపా నేతలు ఒత్తిడి తెచ్చారు. విశ్వాస పరీక్ష నిర్వహించి బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ రెండుసార్లు గడువు విధిస్తూ లేఖ మీద లేఖ రాసి డెడ్లైన్ విధించినప్పటికీ స్పీకర్ గానీ.. ముఖ్యమంత్రి గానీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకెళ్లారు.

మళ్లీ హస్తినకు..?

కర్ణాటక రాజకీయాలు మళ్లీ హస్తినకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు, ముఖ్యమంత్రి కుమారస్వామి సుప్రీం కోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సభ జరుగుతున్న సమయంలోనే వీరు సుప్రీంను ఆశ్రయించారు. పార్టీ విప్ విషయంలో ఈ నెల 17న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో అస్పష్టత నెలకొందని, దీనిపై పునఃసమీక్షించాలని పిటిషన్లో పేర్కొన్నారు. గవర్నర్ జోక్యంపైనా పిటిషన్లో పేర్కొన్నారు. దీంతో కర్ణాటక రాజకీయం హస్తినకు చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రిపీట్ కావొద్దు

మిమ్మల్ని పిలిచినపుడు అందుబాటులో లేరు. భవిష్యత్తులో ఇంకోసారి ఇలా చేయకండి' అని బలయాన్తో వ్యాఖ్యానించారు. ఇందుకు స్పందించిన మంత్రి గైర్హాజరీ పట్ల విచారం వ్యక్తం చేశారు.

కాగా పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాని కేంద్రమంత్రులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న మోదీ.. పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాని కేంద్రమంత్రుల గురించి ఆరా తీశారు. పార్లమెంట్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు కెబినెట్ మంత్రులు కాకుండా.. సహాయ మంత్రులు సమాధానం ఇవ్వడం, మరికొంతమంది? తమ అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు గానీ, సభ్యులు ప్రశ్నిస్తున్నప్పుడు గానీ సభలో లేకపోవడం పట్ల మోదీ అసహనం వ్యక్తం చేశారు. సమావేశాలకు హాజరుకానీ మంత్రుల పేర్లను తనకు అందజేయాలని బీజేపీ పార్లమెంటరీ పార్టీని ఆదేశించారు.

## మెగాస్టార్ చిరంజీవి మమ్మల్ని సంప్రదించలేదు

ఉన్నారన్నారు. తమ పదవులకి రాజీనామా చేసి బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీతో టచ్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రానికి ఒక కేంద్ర మంత్రి పదవి వస్తుందని, సామాజిక న్యాయం ఆధారంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు అనేది ప్రతి మూడేళ్లకు ఒకసారి జరుగుతుందని, కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షుడై రెండేళ్లు మాత్రమే అయ్యిందన్నారు.

# మానవత్వం పరిమళించిన వేళ.....



సింథియా: మనలో చాలా మంది స్వప్రయోజనాలకోసం నగదును, విలువైన సమయాన్ని వెచ్చిస్తారు. ఇతరులు ఎలాపోతే మనకెందుకులే అన్నట్లుంటారు. అయితే కొంతమంది తనకున్న దానిలో ఎంతోకొంత ఇతరులకు పంచుతూ, తనకున్న విలువైన సమయాన్ని, నగదును ఇతరులకు పంచుతూ, పరోపకారమే పరమావిధిగా ముందుకుసాగుతూ మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తారు. అటువంటి కోవకు చెందిన వ్యక్తి పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.వి.సురేష్. ఆనాద శావానికి దహనసంస్కారాలను నిర్వహించి తన మానవత్వాన్ని చాటిన గొప్పవ్యక్తిగా, ఇతరులకు మార్గదర్శకులుగా నిలిచారు. వివరాలోకి వెళితే పారిశ్రామికప్రాంతం శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక షెడ్డువద్ద శుక్రవారం ఆనారోగ్యంకారణంగా పాలిశెట్టి తాతారావు(61)అనే వ్యక్తి మృతిచెందాడు. మృతునికి ఎవరు లేకపోవడంతో పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్యర్యంలో ట్రస్టు చైర్మన్ పి.వి.సురేష్ సొంతఖర్చులతో కోరమండల్ సమీపంలోని శ్మాసానవాటికలో దహణ సంస్కారాలను నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ సేవా గుణం కల్గి వుండాలని, ముఖ్యంగా ఆనాధులపట్ల ప్రేమగా ఉండాలని, వారికి సేవలు అందించాలని సూచించారు.

మనిషి మనిషిని ఆదుకొని మానవత్వాన్ని చటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగూర్, నాగబాబు, రమేష్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కైట్స్ కళాశాలలో ఉచిత దంతవైద్య శిబిరం



అచ్యుతాపురం : దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని ఎంఈఒ సి ఆర్ కె దేవరాయల్ అన్నారు .శుక్రవారం ఆయన కైట్స్ కళాశాలలో ఎర్పాటు చేసిన ఉచిత దంతవైద్య శిబిరాన్ని సందర్శించి కైట్స్ యాజమాన్యాన్ని అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఉచిత దంతవైద్య శిబిరాలు నిర్వహించడం వలన దంత సమస్యల పై అవగహన పెరిగి జాగ్రత్తలు పాటిస్తారన్నారు

ఈ వైద్య శిబిరం లో విష్ణు డెంటల్ కాస్మెటిక్ కేర్ ఎండీ డాక్టర్ అడిగర్ల సుదీర్ ,డాక్టర్ లావణ్య 500 మందికి దంత పరీక్షలు నిర్వహించారు

.ఈ కార్యక్రమంలో కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి ,కైట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆడారి అప్పలనాయుడు ,కైట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ , ఆడారి సన్యాశిరావు ,డైరెక్టర్స్ విల్లూరి ప్రసాద్ , సరిసా నాగేశ్వరరావు ,అడిగర్ల శంకరరావు ,విద్యార్థులు పాల్గొన్నారు .

# విజయభాను

## సంపాదకీయం

### ఉదాసీనతే వైపరీత్యం

చెన్నై నీటికి కటకటలాడి ఎంతో కాలం కాకముందే, వేడి గాలులకు వందమందికి పైగా మరణించిన విషాదపు కన్నీటి చారలు ఆరకముందే దేశాన్ని మరో వైపరీత్యం ముంచెత్తింది. ఈసారి ప్రకృతి బీహార్, అస్సాం రాష్ట్రాలపై వరద ఖడ్గాన్ని ఝుళిపించింది. ఈ వరదలకు ఒక్క బీహార్‌లోనే దాదాపు డెబ్బయి మంది మరణించారు. అధికారిక లెక్కల ప్రకారమే 46. 83 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. అస్సాంలోనూ దాదాపు ముప్ఫై మంది బలయ్యారు. 57.51 లక్షల మంది ఈ వరదల బారిన పడిన అల్లాడిపోతున్నారు. కజిరంగా మనాస్ జాతీయ పార్క్‌లు, పోబితార అభయారణ్యం ముంపునకు గురికావడంతో మూగ జీవాలు ప్రమాదం ఏర్పడ్డది. యూపీ తదితర రాష్ట్రాలలోనూ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈశాన్యంలోని మేఘాలయ, మిజోరం రాష్ట్రాలనూ వరదలు ముంచెత్తాయి. పశ్చిమ గరోహిల్స్ జిల్లా, ఖాసీ కొండ ప్రాంతాలలో వరదలు రావ డం వల్ల పదమూడు లక్షల మంది కకావికలయ్యారు. వారం రోజులుగా దేశాన్ని ముంచెత్తి న వరదలు కొంచెం తగ్గుముఖం పట్టాయని అంటున్నారు. భారీ ఎత్తున సహాయక చర్యలు చేపట్టడంతోపాటు, ప్రజలు వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ఏటేటా వస్తున్న వరదలతో బీహార్, అస్సాం తదితర రాష్ట్రాలలో జనజీవనం ఛిద్రమైపోతున్నది. బొటాబొటి ఆదాయంతో బతికేవాళ్ళ పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నది. ఒకప్పుడు అతివృష్టి అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, జాతి మనసు మీద గాటు పడ్డట్టుగా ఉండేది. ఆ బాధలను తరతరాలు వివిధ రూపాలలో చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు ప్రకృతి వైపరీత్యాలు ఏటేటా సంభవిస్తున్నాయి.

ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం వల్ల ఏటా వరదలు వచ్చి లక్షలాదిమంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకవలసి వస్తున్నది. వరదల పరిస్థితిపై రెండు దేశాల మధ్య చర్చలు సాగుతూనే ఉంటాయి. కానీ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఈ చర్చలు ఎప్పుడు కొలిక్కిరావు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన ముందుకు వచ్చిన సందర్భంగా నీటి పంపకాలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విషయాలు ఈ సందర్భంగా చర్చించుకోదగినవి. దేశంలో సమృద్ధిగా నీటి లభ్యత ఉన్నది. మన నదీ జలాలతో దేశ అవసరాలన్నీ తీర్చవచ్చు. కానీ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల దేశం ప్రకృతి వైపరీత్యాల పాలు కావలసి వస్తున్నది.

ఏడాది పొడుగునా వైపరీత్యాల మధ్య గడపవలసిన ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వానకాలం వచ్చినప్పుడల్లా మన దేశంతోపాటు నేపాల్, బంగ్లాదేశ్ రాష్ట్రాలలో వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల సమస్య నుంచి ఏ ఒక్క దేశాన్ని విడదీసి చూడలేము. 2017లో ఈ మూడు దేశాలను వరదలు ముంచెత్తినప్పుడు వెయ్యి మందికిపైగా మరణించారు. భారీ ఎత్తున పంటలు నాశనమయ్యాయి. తాజా వరదలలో నేపాల్‌లో దాదాపు ఎనభై మంది మరణించారు. మరో ముప్ఫై మంది జాడ తెలువడం లేదు. బంగ్లాదేశ్ కూడా అతలాకుతలమవుతున్నది. భారత్ నేపాల్ మధ్య దాదాపు 1800 కిలోమీటర్ల సరిహద్దు ఉన్నది. ఆరు వేలకు పైగా నదులు, సెలయేళ్ళు నేపాల్ నుంచి భారత్‌లోకి ప్రవహిస్తున్నది. ఈ నీటిని ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన రీతిలో కట్టడి చేసి పొలాలకు మలుపుకోవాలె. ఇదే విధంగా ఈ ప్రాంతంలో పర్యావరణానికి హాని కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలె. భారత్‌లో చేపట్టిన నిర్మాణాల వల్ల నీటి ప్రవాహాలు సహజసిద్ధంగా సాగక తమ దేశంలో వరదలు వస్తున్నాయనేది నేపాల్ ఆరోపణ. కోసీ బ్యారేజీపై 56 వరద గేట్లున్నాయి. వాటిని తెరవకపోవడం వల్ల తమ ప్రాణసంకటంగా మారిందనేది కూడా నేపాల్ విమర్శ. కానీ ఇప్పటికే తాము వరద బీభత్సానికి గురవుతున్నామనేది భారత్ నుంచి వినిపిస్తున్న వాదన. నేపాల్‌లో, సరిహద్దు సమీపంలోని భారత్ భూభాగంలో అడవుల నరికివేత యథేచ్ఛగా సాగుతున్నది. తవ్వకాలు కూడా జోరుగా ఉన్నది. యూపీ, బీహార్ రాష్ట్రాలలో మౌలికవసతుల నిర్మాణాలు భారీగా సాగుతున్నాయి. ఇందుకోసం నదీ తీరాల్లోని ఇసుక, గులకరాళ్ళు, రాళ్లు తవ్వుక పోవుడం వల్ల కూడా వరదలు వస్తున్నాయి.

సహజసిద్ధమైన ప్రవాహాలు దెబ్బతింటున్నాయి. ప్రవాహాలకు ప్రకృతి సిద్ధమైన అడ్డంకులూ తొలిగిపోతున్నాయి. ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం వల్ల ఏటా వరదలు వచ్చి లక్షలాదిమంది ప్రాణాలను అరచేతి లో పెట్టుకొని బతకవలసి వస్తున్నది.

వరదల పరిస్థితిపై రెండు దేశాల మధ్య చర్చలు సాగుతూనే ఉంటాయి. కానీ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఈ చర్చలు ఎప్పుడు కొలిక్కిరావు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన ముందుకు వచ్చిన సందర్భంగా నీటి పంపకాలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విషయాలు ఈ సందర్భంగా చర్చించుకోదగినవి. దేశంలో సమృద్ధిగా నీటి లభ్యత ఉన్నది.

## సివిల్ సప్లై కళాసీలకు పని భద్రత కల్పించాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : సివిల్ సప్లై, గిరిజన కార్పోరేషన్ కళాసీలకు పని భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై హమాలిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు మాట్లాడుతూ విశాఖజిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, గిరిజన కార్పొరేషన్‌ల యొక్క గొడౌన్స్ 30 మండలాల్లో ఉన్నాయని, ఈ గొడౌన్స్ వద్ద సుమారు 500 మంది కళాసీలు ప్రజలకు ఆహార ధాన్యాలు సరఫరా చేస్తున్న కళాసీలు నిత్యం ఎగుమతి, దిగుమతి చేస్తూ పనులు చేస్తుంటారన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సొంతంగా గొడౌన్స్ కట్టారన్నారు. కొన్ని చోట్ల వేబ్రిడ్జిలు ఏర్పాటు చేశారని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాసీలకు పని భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇప్పుడు ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్ ద్వారా ఎగుమతి, దిగుబడి జరుగుతుందా లేదా అనేది తెలియకపోవడంతో కళాసీలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారన్నారు. కళాసీల పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఇప్పుడు ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్ ద్వారానే ఎగుమతి, దిగుబడి జరగాలని కోరుతున్నామన్నారు. కళాసీలు అలా కానిపక్షంలో గత 30 ఏళ్ల నుండి పని చేస్తున్న కళాసీలు వారి కుటుంబాలు రోడ్డున పడతారని చెప్పారు.

రాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడితే కళాసీల బతుకులు బాగు పడ తాయని, వారికున్న సమస్యలు తీరుతాయని ఎదురు చూసిన కళాసీలకు ఇప్పుడు ఉన్న పని ఉంటుందా పోతుందా అనేది తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్యాకింగ్ విధానం ద్వారా ప్రజలకు బియ్యం సరఫరా చేయాలని చూస్తుందని, గ్రామ వలం టీర్ల ద్వారా ఇంటింటికి పంపాలని చూస్తుందని, ఈ మొత్తం పనిని ఎంఎల్‌ఎస్ పాయింటు ద్వారానే జరిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.గురుబాబు, ఎం.రామునాయుడు, ఎస్.కొండలరావు, ఎస్‌కె.రెహమాన్, ఎస్.రమణ, పి.అప్పారావు, కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకం సిబ్బందిని పంచాయతీరాజ్‌లో విలీనం చేయాలి

### ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్, జె.ఏ.సి.కన్వీనర్ దాసరి కొండాజి


కలెక్టర్ కార్యాలయంలో జె.సికి వినతి పత్రం అందిస్తున్న గ్రామీణ ఉపాధిహామీ పథకం జె.ఏ.సి. నాయకులు.

చోడవరం : గ్రామీణ అభివృద్ధి శాఖ - మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నందు పనిచేస్తున్న మండల, జిల్లా స్థాయి సిబ్బంది విధులను పంచాయతీ రాజ్ డిపార్టుమెంట్‌లో విలీనం చేస్తూ, తమ ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జె.ఏ.సి.కన్వీనర్ దాసరి కొండాజి ప్రభుత్వాన్ని కోరినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య మంత్రి వై.ఇస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించుకాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించే గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది సమస్య లపై వినతి పత్రం అందచేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రభుత్వం ద్వారా నోటిఫికేషన్ ఇవ్వబడి జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహింపబడి రోస్టర్ ప్రకారం ఉద్యోగులుగా నియమించడం జరిగిం దన్నారు. అప్పటి నుంచి కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న తమను పంచాయతీరాజ్ శాఖలో విలీనం చేసి క్రమబద్దీ కరించాలని, గ్రామ సచివాలయాలలో కొత్తగా నియామ కాలు జరిపే ఉద్యోగాలలో తమను సర్దుబాటు చేయాలని కోరారు. ప్రతి పక్షనేతగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని, అలాగే గుంటూరు ఓదార్పు యాత్రలోను రెగ్యులర్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, హామీ మేరకు తమను క్రమబద్దీకరించాలని కోరారు. అలాగే వివిధ ఉద్యోగుల ప్రస్తుత అర్హత, సీనియారిటీని పరిగణలోకి తీసుకుని పదో న్నతులు కల్పించాలని కోరారు.

ప్రస్తుతం గ్రామ సచివాల యాలలో నూతనంగా జరిపే ఉద్యోగ నియామ కాలలో ఉపాధి సిబ్బందిని పరిగణలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పిం చాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జె.యే.సి, ట్రెజరర్ కింపోల శివాణి, జె.ఏ.సి, సభ్యురాలు కె.దేవకి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా వలంటీర్ల నియామకం

### జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణకుమారి

నాతవరం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా గ్రామ వలంటీర్ల నియామకం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) అయిన నాతవరం మండల ప్రత్యేకాధికారి వంగా కృష్ణకుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వైడిపేట, ఎంబి.పట్నం పంచాయతీలకు చెందిన అభ్యర్థులకు జరిగిన ఇంటర్వ్యూలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పదం, ప్రభుత్వ పథకాలపై అవగాహన ఆధారంగానే నియమిస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో పారిశుద్యంపై సమావేశం నిర్వహించారు. పారిశుద్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ శిరీషారాణి, తహశీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### పల్లలే సౌభాగ్యాలంట

పెంచిన తల్లి పంచ్చల్లో వుంది
కనికారం కడవల్నిండా వుంది
కంచాల్లో తిండి పుష్టిగా తినమంటుంది
పల్లెల్లో ఆమాటుంది.
పండగ, పబ్బం - ఇంటింట
ప్రతి యింట - చుట్టాలంట
పల్లె సంపద - బతుకులు పంట
ఇంటింట - ఆనందాలంట.
పద్యం చదివితే...
మళ్ళీ, మళ్ళీ ఫలకాలంటు
ఈలలుతో ఉత్సాహలెంతెంతో
పౌరాణిక నాటకాలు పల్లెల్లో యింకెంతో
బతుకులు బాట - పల్లె, పేటల్లో
దానాలకు చల్లని - చేతుల్లు
చేతార నిండంట
చేతార పెట్టినవాడు
పల్లె, పేటంట.
పల్లె, పేటలు, కళకళలాడే రోజులు వస్తున్నాయ్
పల్లెలు కేమి కొరదే లేదని పిద్దాం
చూడముచ్చటగ - పల్లెలు- అనిపిద్దాం
గాంధీ చెప్పిన మాటలు
పల్లె, పేటలు సౌభాగ్యలంట.

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : ఆషాఢ; తిథి : తదియ 6.30; శతభిషం తె.5.32; ఉ.వ.10.55ల 12.41.

శనివారం 20-07-2019

**మేషం** : ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఆత్మవిశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు. ఉద్యోగ భద్రత వల్ల భవిష్యత్ పట్ల భరోసా వస్తుంది. రాబోయే ఆదాయానికి తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. **వృషభం** : బంధువుల విషయంలో తలదూర్చడం కంటే మీ పనులు మీరు చేసుకోవడం మంచిది. మీ సంతానం మీ మాటను గౌరవిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. స్త్రీలకు ప్రకటనలు, స్కీముల పట్ల అవగాహన అవసరం. **మిథునం** : దీర్ఘకాలంగా కోర్టులో ఉన్న కేసు ఒకటి మీకు ఊరట నిస్తుంది. స్త్రీలు గృహోపకరణాలు కొనుట పట్ల ఆసక్తి చూపుతారు. రాబడికి తగినట్లుగా ఖర్చులు ఉంటాయి. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల కష్టనష్టాలు చవి చూడాల్సి వస్తుంది. **కర్కాటకం** : వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. సాహస ప్రయత్నాలు విరమించండి. పలుకుబడి ఉన్న వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. కుటుం బీకుల కోసం ధన బాగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. **సింహం** : పత్రిక, ప్రింటింగ్ రంగాల వారికి ఓర్పు, అంకితభావంతో శ్రమించాల్సి ఉంటుంది. స్త్రీలకు పనివారతో ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మిత్రులను కలుసుకుంటారు. చేతివృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచింది. **కన్య** : ఇంటా బయట అధిక కృషి అనంతరం మంచి ఫలితాలను పొందుతారు. కొబ్బరి, పండ్ల, పూల, చిరు వ్యాపారులకు కలిసి రాగలదు. స్త్రీలకు ఆర్జనపట్ల ఆసక్తి, అందుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను చేజార్చు కుంటారు. **తుల** : నూతన టెండర్ల విషయమై ప్రముఖులతో సంప్ర దింపులు జరుపుతారు. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. స్త్రీలకు ఆరోగ్యకరమైన సంప్రదింపులు జరుపుతారు.. **వృశ్చికం** : రుణాలు తీరుస్తారు. మీ సంతానం వివాహం, విద్య విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కను పరుస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. పోస్టల్, ఎల్.ఐ.సి ఏజెంట్లకు ఆర్థికంగా బాగుంటుంది. **ధనుస్సు** : ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. ఉద్యోగస్తులకు పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికంగా ఉంటాయి. దైవ, సేవా కార్యక్రమా లకు సహాయ సహకారాలు అందిస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. వస్త్ర, బంగారు, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. **మకరం** : గృహ మార్పులు, మరమ్మతులు అనుకూలిస్తాయి. స్త్రీల, ఆలోచనలు, అభిప్రాయాలకు మంచి స్పందన లభిస్తుంది. **కుంభం** : వాహనం విలువైన వస్తువులు ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి. విద్యార్థులు క్రీడలు, క్విజ్ పోటీల్లో రాణిస్తారు. గృహ నిర్మాణాలలో స్వల్ప అడ్డంకులు, చికాకులు ఎదుర్కొంటారు. **మీనం** :సత్కాలం ఆసన్నమైంది, మీ ఆలోచనలు, పథకాలు అమలు చేయండి. అనుకున్న పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఉద్యో గస్తులు యూనియన్ కార్య కలాపాల్లో తలమునకలై ఉంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది.




## వేంకటేశ్వరుని సత్య లీలలు..

### సంకీర్తన

నిత్యకల్యాణం.. పచ్చుతోరణం అనే మాట వేంకటేశ్వరస్వామికి సంబంధించినదే. అసలే వైభవంతో వెలుగొందే స్వామి .. అలాంటి ఆయన కల్యాణోత్సవం చూడటానికి రెండుకళ్ళూ చాలవు. స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించడమే ఈ జన్మకి దక్కిన మొదటి అదృష్టమైతే, ఇక ఆ స్వామికి కల్యాణోత్సవాన్ని జరిపించడం వలన ఎంతటి పుణ్యఫలితాలు కలుగుతాయో అర్థం చేసుకోవచ్చు.అందుకే తిరుమలలో స్వామికి కల్యాణం జరిపించడానికి భక్తులు పోటీలు పడుతుంటారు. ఇక అంతవరకూ వెళ్లే అవకాశం లేని వాళ్లు తమకి దగ్గరలో గల వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తుంటారు. అవకాశాన్ని బట్టి కుటుంబసభ్యుల వరకూ .. బంధువులను పిలిచి ఈ వేడుకను జరుపుతుంటారు. మనసులోని కోరికలు ఫలించడం కోసం .. ఫలించడం వలన ఈ వేడుకను జరిపిస్తుంటారు.ఇక ప్రతి ఏడాది ఈ వేడుకను జరిపించే భక్తుల సంఖ్య కూడా అధికంగానే వుంటుంది. వేంకటేశ్వర స్వామికి .. అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఇలా కల్యాణాన్ని జరిపించడం వలన, సమస్త కష్టనష్టాలు తొలగిపోతాయి. దోషాలు .. పాపాలు .. నశించిపోతాయి. దారిద్ర్యము .. దుఃఖము దూరమై ఆయురారోగ్యాలు కలుగుతాయి. స్వామివారి కల్యాణాన్ని చేయించినవారికి ఎంతటి పుణ్యఫలం లభిస్తుందో, చూసినవారికి సైతం అంతటి పుణ్యఫలం లభిస్తుందని స్పష్టం చేయబడుతోంది.

లోకకళ్యాణం కొరకై యజ్ఞం తలపెట్టిన మహర్షులు త్రిమూర్తులలో గొప్పవారెవరో నిర్ణయించమని భృగుమహర్షిని పంపుతారు. అరికాలిలో నేత్రం కారణంగా తనకి గల శక్తిపట్ల గర్వితుడై ఉన్న భృగు మహర్షి, తొలుత సత్య లోకాన్ని చేరాడు. వేదగానం చేస్తూ బ్రహ్మ దేవుడు, ఆయన గాత్రానికి వీణానాదాన్ని అందిస్తూ సరస్వతీ దేవి సంగీతంలో సంలీనులై ఉన్నారు. ఆలుమగలిద్దరూ ఒకే అనుభూతిలో లయించి ఉండగా ఆ అనునాదం అనంతమై విస్తరించింది. భృఎిగు రాక వారిని ఆటంక పరచ లేదు. దాంతో వారు ఆయన రాకకి స్పందించ లేదు. బ్రహ్మకు భూలోకంలో ఆలయాలుండవని శపించిన భృగవు, నేరుగా కైలాసానికి వెళ్ళాడు.

కైలాసంలో శివపార్వ తులు నాట్యంలో లీనమై ఉన్నారు. ఆది దంపతులతో బాటు గణపతి కుమారస్వామి సహితంగా నందీ భృంగీ, రుద గ్రణాలు ఆ పారవశ్యంలో ఉన్నారు. ఇక్కడా భృగు మహర్షికి స్వాగత సత్కారాలు లభించ లేదు. పార్వతీపరమేశ్వరులు తాళం తప్పకుండా చేస్తున్న నాట్యం సర్వసృష్టికీ శృతిలయలై ఉంది. అహంకార రహితుడై ఉండి ఉంటే భృగు మహర్షి, ఆది దేవుడు నాట్యమాపి తనని పలక రించే వరకూ సహజంగా, భక్తిగా, వేచి ఉండేవాడు. కానీ భృగువుకి అదనపు శక్తి ఉంది. దాని తాలూకూ అహంకారమూ ఉంది. కాబట్టి భక్తుడు భగవంతుడి కోసం వేచి ఉండటం కాదు, భగవంతుడే భక్తుడి రాక కోసం మెళకు వతో ఉండాలనుకున్నాడు. దాంతో ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేక లింగాకృతికే తప్ప పరమే శ్వరుడి రూపానికి అర్చనలుండ రాదని శపించి వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ లక్ష్మీనారాయణు లు చదరంగ వినోదంలో ఉన్నారు. సత్యలోకంలో బ్రహ్మ సరస్వతుల



హృదయాలు సంగీత భరితమైతే, కైలాసంలో శివపార్వతుల తనువులు నాట్యగతిలోల యించి ఉన్నారు. వైకుంఠంలో లక్ష్మీ విష్ణువులు మేధస్సు పరంగా చదరంగ క్రీడలో మునిగి ఉన్నారు. సృష్టి స్థితి లయకారులం కదా అని త్రిమూర్తుల్లో ఎవరూ ఇల్లాలితో గడపటానికి టైం లేదు. బిజీగా ఉన్నాం అనలేదు, అను కోలేదు.

క్రీడా వినోదంలో మునిగి ఉన్న శ్రీహరి శ్రీదేవిలను చూశాడు భృగువు. అప్పటికే ఆగ్రహం హద్దులు దాటి ఉంది. కాలెత్తి మహా విష్ణువు వక్షస్థలంపై తన్నాడు. గుండెలపై తన్నిన బిడ్డణ్ణి చూసిన తండ్రిలా శాంతంగా చిరునవ్వు నవ్వాడు శ్రీహరి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## లచ్చన్నపాలెం వీఆర్వీ నియామకం

మాకవరపాలెం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లచ్చన్నపాలెం వీఆర్వీ బి.శ్రీనివాస్ తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత 17-7-18 సంవత్సరంలో లచ్చన్నపాలెం ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్టు విచారణ చేసి అప్పట్లో విధులు నుంచి తొలగించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు వీఆర్వీ దరఖాస్తు చేయడంతో విచారణ జరిపి తిరిగి అదే గ్రామంలో వీఆర్వీగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపిడిఓ అరుణశ్రీ వీఆర్వీకి నియామకం పత్రాన్ని అందించారు.

పెదవాల్తేరు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా పి.జగదీష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అక్కయ్యపాలెం రైతుబజార్ నుంచి పెదవాల్తేరుకు వచ్చారు. ఇప్పటివరకు పెదవాల్తేరులో వున్న నలమహరాజు ఎంవీపీ రైతుబజారుకు బదిలీ అయ్యారు.



## కొండకర్ల ఆవను అభివృద్ధి చేయాలి

### పార్లమెంట్‌లో డాక్టర్ సత్యవతి



అనకాపల్లి : జిల్లాలోని అతిపెద్ద ఆవ అయిన కొండకర్ల ఆవను అభివృద్ధి చేయాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి విజ్ఞప్తి చేసారు. గురువారం రాత్రి జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో సత్యవతి మాట్లాడారు. 2564 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొండకర్ల ఆవను ఇటు ఇరిగేషన్ అధికారులు, పర్యాటక అధికారులు కలిసి అభివృద్ధి చేయాలన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రాంత రైతాంగాన్ని వాటర్ స్టోరేజీగా కొండకర్ల ఆవ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిని అభివృద్ధి చేస్తే అటు రైతాంగం, ఇటు పర్యాటకంగా ఎంతో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు అధికారులను ఆదేశించి అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డాక్టర్ సత్యవతి కోరారు.

## జూనియర్ అసిస్టెంట్‌గా శామ్యూల్ బాధ్యతలు స్వీకరణ

కోటవురట్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీలు ఒక్కొక్కటిగా భర్తీ అవుతున్నాయి. జూనియర్ అసిస్టెంట్‌గా శామ్యూల్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాయకరావుపేట మండలం ఎస్.నర్సాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన శిరీష నర్సీపట్నంలో పిఆర్ డిపార్టుమెంట్‌కు బదిలీపై వెళ్లారు. శామ్యూల్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల పరిషత్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## కథలపోటీ విజేతలకు పురస్కారాలు

విజయనగరం : అరిగిపూడి పూర్ణచంద్రరావు స్మారక మల్లెతీగె కథల పోటీల్లో జిల్లా రచయితలసంఘం ప్రధాన కార్యదర్శి కె.కె.రఘునందన రచించిన "దారి చూపేది ఆ దేముడే" కథకు, కె.కె.భాగ్యశ్రీ రచించిన "తెగింపు" కథకు బహుమతులు లభించాయి. విజయవాడ ఐలాపురంలోని జరిగిన సభా కార్యక్రమంలో అయన్ అరిగిపూడి విజయకుమార్ కథకులను సత్కరించారు. సంపాదకులు కలిమిశ్రీ, ఈడ్పుగంటి పద్మాజారాణి తదితరులు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత రఘునందన, భాగశ్రీ దంపతులకను జిల్లా రచయితల సంఘం నుండి డాక్టర్ డి.వి.జి.శంకరరావు, నాలుగెస్సుల రాజు, చివుకు శ్రీలక్ష్మి, సూర్యలక్ష్మి అభినందించారు.

# స్వయంభూ విఘ్నేశ్వరుని ఆలయం హుండీ లెక్కింపు



చోడవరం : పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం లెక్కించారు. మొత్తం 62 రోజులకు గాను 1లక్షా 63 వేల, 943 రూపాయలు హుండీ ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి యస్.వి.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. దేవాదాయశాఖ ఇనస్పెక్టర్ వి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేస్, అర్చకులు చలపతిరావు, శ్రీ హరి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు సామూహిక లక్ష్మీగణపతి హోమం** : ఆషాడ బహుళ చవితి(సంకటహర చతుర్థి)సందర్భంగా నేడు(శనివారం)సామూహిక లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్ తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

# ఘనంగా డాక్టర్ రామ్మూర్తి జన్మదిన వేడుకలు



అనకాపల్లి : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రామ్మూర్తి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.

వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మందపాటి జానకి రామ రాజు, జాజులరమేష్, సూరిశెట్టి రమణ అప్పారావు, కొణతాల మురళీ కృష్ణ, తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఆయన నివాస గృహానికి వెళ్లి శుభాకాంక్షలు అందజేసారు. కేక్ కటింగ్ నిర్వహించారు. సాలువాతో . అనంతరం పట్టణ వైసిపీ అధ్యక్షులు జాని మాట్లాడుతూ అనకాపల్లిలో వైద్య రంగంలో రామ్మూర్తి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నా రన్నారు. అనేక సందర్భాలలో ఆరోగ్య సమస్యలపై సదస్సును నిర్వహించి ప్రజలను చైతన్యవంతులు చేసారన్నారు. మరిన్ని పుట్టిన రోజులు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పలక రాము, పాలమరశెట్టి మురళీ, పెతకం శెట్టి జగన్మోహన్, ఏడువాకల నారాయణరావు, విల్లూరి శివసూరి, గైపూరి రాజు, సకలా గోవింద బొడ్డడ శివ, తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారిని శుక్రవారం మాజీ మంత్రి విశాఖనార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మరియు వీఎంఆర్డిఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ స్వామివారిని దర్శించు కున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్ప స్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు. దర్శనంకి విచ్చేసిన గంటా శ్రీనివాసరావుకు సింహాచలం టీడీపీ నాయకులు పీవీ నరసింహం కర్రి స్వామి బృందం కలిసి స్వాగతం పలికారు.

## రోలింగ్ ట్రోఫీ విజేతగా స్టార్ డాన్స్ ఫిల్మ్ అకాడమీ




విశాఖపట్నం : వీటీమ్ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన బూగీ థ్రిల్ పోటీలలో విశాఖ లో ఉన్న 25 డాన్స్ అకాడమీ లు పాల్గొనగా రోలింగ్ ట్రోఫీ విజేతగా స్టార్ డాన్స్ ఫిల్మ్య అకాడమీ నిలిచిందని సంతోష్ డాన్స్ మాస్టర్ తెలిపారు. భారత దెస ప్రముఖ సంస్థ వీ టీమ్ చైర్మన్ వీరుమామ గారు ఇటువంటి కార్యక్రమాలు పెట్టి మంచి ప్లాట్ఫారం కల్పిస్తున్నారని,సుమారు రెండు వొందల మంది విద్యార్థులు తమ అకాడమీ నుండి పాల్గొన్నారని, అందులో సోలో విభాగంలో కూడా అవార్డులు అందుకుని, ఔట్స్టాండింగ్ రోలింగ్ ట్రోఫీ గెలిపొందినందుకు చాలా సంతోషంగా ఉందని,యువత మంచి నైపుణ్యం తో శిక్షణ లో పాల్గొంటున్నారని ఆనందం వ్యక్త పరిచారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి తండ్రులు ,దామిని విల్లా సినిమా హీరోయిన్ రేఖ భోజ్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డు ద్వారా మొక్కల పెంపకం

విజయనగరం: జిల్లాలో ప్రతి మండలానికి గృహ నిర్మాణ సంస్థ ద్వారా కాలనీల్లో 2 వేల మొక్కలునాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. బాదాం,జామ, వేప, నేరేడు, టేకు, బొప్పాయి, నందివర్ధనం ఏనుగుపాదం, కాగు, దేవకాంచన, గోరింట, మామిడి మొక్కలు ఈ మేరకు పంఇణీ జరిగింది.

## నూకాంబిక సహాయ కమిషనర్‌గా అన్నపూర్ణ



అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి ఆలయానికి నూతన సహాయ కమిషనర్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన సహాయ కమీషరన్ సుజాత బదిలీపై వెళ్లడంతో టి. అన్నపూర్ణ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సుజాత స్థానంలో అన్నపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా డిప్యూటీ కమీషనర్‌గా ఎం. సుజాత బదిలీపై విశాఖపట్నం వెళ్లారు. ఆమెను అధికారులు సత్కరించారు. విజయనగం పైడితల్లి అమ్మవారి దేవస్థానం నుండి అన్నపూర్ణ ఇక్కడకు బదిలిపై వచ్చి విధులు స్వీకరించారు. సుమారు ఐదేళ్లుగా సహాయ కమీషనర్‌గా సుజాత నూకాంబిక ఆలయంలో బాధ్యతలు నిర్వహించారు.

## బాధ్యతలు స్వీకరించిన ద్రోణంరాజుకు అభినందనలు తెలిపిన పైలా



పరవాడ: విశాఖపట్నం మెట్రో రీజియన్ డవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ద్రోణంరాజు శ్రీనివాస్ శుక్రవారముబాధ్యతలు స్వీకరించారు. ఈయనకు వైసిపిరాష్ట్ర సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైలశ్రీనువాసురావు, పరవాడ మండలపార్టిప్రెసిడెంట్ సిరిపురపు అప్పలనాయుడు, వైసిపి జిల్లాప్రదాన కార్యదర్శిచుక్క రామునాయుడు పుష్ప గుచ్ఛము ఇచ్చి అభినందనలు తెలియజేసారు. ఈకార్యక్రమంలోకోన రామారావు, చల్లా కనకారావు, జూనియర్ అప్పలనాయుడు, నర్సింగరావు, అప్పారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ పరిధిలో 3525 క్వింటాళ్ల విత్తనాలు అందించాం

**-వ్యవసాయ శాఖ ఏ.డీ ఎఈ ఆర్.ఎ.శ్రీనివాసరావు**



దేవరాపల్లి : ఖరీఫ్ సీజన్లో రైతులకు 3525క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై డివిజన్లో అందచేస్తామని వ్యవసాయ శాఖ ఎడిఎఈ ఆర్.ఎ .శ్రీనివాస్రావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలో వరి నారుమళ్లు పరిశీలన చేశారు. స్థానిక పురుగుల మందుల షాపులను తనిఖీ చేశారు అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చోడవరం డివిజన్ పరిధిలో పన్నెండు వేల హెక్టార్లలో ఖరీఫ్ వరి పంట వేయడానికి నారుమడులు సిద్ధం చేసి ఉన్నారని అన్నారు. త్వరలో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం పంటలకు2019-20 సంబంధించి వరి పంటలకు ఆగస్టు21 తేదీ వరకు, చెరకుకు ఈ నెల వ 31తేదీ వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరడానికి గడువు ఉందని తెలిపారు.బీమా పథకంలో తమ పంటలను నమోదు చేసుకోవాలని ,నమోదు చేయించుకున్న వారు వారి భూమి పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, ఆన్లైన్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన పంటల బీమా పథకంలో వరి, చెరుకు, రాగులు, మినుములు, సజ్జలు, కంది, మొక్కజొన్న ,వేరుశనగ, సంబంధించి బీమా పథకంలో వర్తిస్తాయని తెలిపారు.చోడవరం డివిజన్ పరిధిలో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేశారని తెలిపారు. ప్రతి రైతులు తమ పండించే పంటను తప్పక ఈ క్రాపింగ్ చేయించాలని ,ఈ క్రాపింగ్ లో నమోదు చేస్తేనే ఆ రైతుకు బీమా సొమ్ము వర్తిస్తుందని తెలిపారు.ఈయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి డి. అప్పారావు, వ్యవసాయ విస్తీర్ణాధికారి ఎస్. కిరణ్ కుమార్, ఎంపిఈఓ పి. సత్యారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ వి.వినయ్‌చంద్



విశాఖపట్నం : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ఈరోజు మూడవ శుక్రవారము జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై వారి సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఉద్యోగుల సమస్యలను నిర్దేశిత కాల పరిమితిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల తో పాటు ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాల్సిందిగా గౌ. ముఖ్యమం9ఇట వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. వారి ఆదేశం అనుసరించి ప్రతి నెల మూడవ శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై వారి నుండి దరఖాస్తులను స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఉద్యోగులు

నిరంతరం తమ విధి నిర్వహణలో ఉంటారని, వారి సర్వీసు విషయంలో ఎన్నో సమస్యలు ఉంటాయన్నారు. సదరు సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఏజెన్సీ ఉద్యోగులు, వికలాంగ ఉద్యోగులు, ఆరోగ్యశాఖ లోని నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బంది, డిఆర్‌డిఎ మహిళా ఉద్యోగులు బదిలీలను గూర్చి, ఒప్పంద రంగ ఉద్యోగులు వారి సమస్యలను

గూర్చి కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ తమ స్థాయిలో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని, పై అధికారులకు పంపిస్తామని తెలియజేశారు. ప్రతి గురువారం జాయింట్ కలెక్టరు సాధారణ 9స్త్రఎఱవెన్స్ పై సమీక్ష చేస్తున్నారని ఇక మీదట ఉద్యోగుల 9స్త్రఎఱవెన్స్ పై కూడా సమీక్ష చేస్తారన్నారు. దరఖాస్తు ఇచ్చిన ప్రతి ఒక్కరికి రసీదు ఇస్తున్నారని, స్పందన కార్యక్రమంపై జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపిన విఆర్వోలు దీఫవణఋఎంమణ జరిగిన 9స్త్రూమ రెవెన్యూ అధికారుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించినందుకు గాను వీఆర్వోలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వెబ్‌సైట్ ప్రారంభం : పభుత్వ ఉద్యోగుల సమస్యల నివేదన పరిష్కారానికి రూపొందించిన ఒక ప్రత్యేక వెబ్ సైట్

ను కలక్టరు ప్రారంభించారు. ఉద్యోగుల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను www.egs.vizagcollectorate.in. వెబ్ సైట్ ద్వారా సంబంధిత శాఖ అధికారికి పంపిస్తామని, వాటిపై కలెక్టర్ కార్యాలయం నుండి సమీక్ష నిర్వహిస్తారని ఎన్ ఐ సి అధికారి

పాషా తెలిపారు. రానున్న కాలంలో ఉద్యోగులు సదరు వెబ్ సైట్ ద్వారా సమర్పించుకునే వీలు ˆల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎల్.శివశంకర్, జె.సి.2 ఎమ్. వెంకటేశ్వరరావు, జిల్లా ంవెన్యూ అధికారి జి.గున్నయ్య ఎన్ఐసి అధికారులు మూర్తి, పాషా తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

General Public are hereby put to notice that the our Client M/s. LIC HOUSING FINANCE LIMITED intended to accept the property viz., site of 500 Sq. Yds in Sy.No. 24/2 of Vadlapudi, Gajuwaka, Visakhapatnam, owned by Mrs. S. Padma under Sale Deed No. 970/1998 dt. 18-05-1998 executed by D. Prabhakararao, registered before SRO, Gajuwaka. It is informed to us by the said party that the original Sale Deed No.970/1998 dt. 18-05-1998 executed by D. Prabhakararao in favour of S. Padma has been lost by her during transit while she was coming from the Visakhapatnam City to Gajuwaka. She also informed that she also made complaint to police through Mee Seva for tracing out the same. Therefore, any person/ persons having any objections as to the mortgage by Mrs. S. Padma in favour of LICHFL, may approach the following address with all supporting original documents within 7 (Seven) days from the date of this notice, otherwise, it will be presumed that there are no objections to this notice and that my client LIC Housing Finance Limited, will proceed further accepting the mortgage of the above said property as security.

**AVSR SONS**
**A.S. RAMA SARMA & A. SRINIVASA SARMA**
Advocates
101, MVV Arcade, Palace Layout,
Peda Waltair, Visakhapatnam-530017.
Cell : 9440716959, 9440794272

**IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM**
**O.S.150/2012**

Between :
B.V. Chowdary …Plaintiff
And
M/s. Ramakoti Leela Constructions,
Rep. by its Proprietor D. Narendra & others …Defendants

**SUMMONS**

To,
**DEFENDANT No.4:**
**Smt. Pusapati Hymavathi Devi,**
D/o. Vijaya Rama Raju, Hindu,
Aged about 31 years,
R/at. Plot No.119, Sector-XI,
M.V.P. Colony, Visakhapatnam-17

Please take notice that the above named plaintiff filed the above suit against you and others for specific performance of contract and the suit stands posted to **09-08-2019** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **09-08-2019 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
**B.V. SATYANARAYANA**
Advocate
Visakhapatnam,
Cell: 98660 45759

# భవిష్యత్ బిజేపీదే



అనకాపల్లి : దేశంలో భాజపా పార్టీ మరింత బలపడనుందని రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి రానుందని మాజీ ఎంపీ జాతీయ కార్యవర్గ సభ్యులు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. రోటరీ కళ్యాణ మండపంలో శుక్రవారం ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లలో ప్రధాని మోడీ విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజల మనసును గెలిచారన్నారు. రానున్న ఐదేళ్లలో కూడా అద్భుత పాలన అందించి ఆంధ్రప్రదేశ్ లో పాగా వేయడం ఖాయమన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ ,తలాక్ విధానం రద్దు వంటి అనేక నిర్ణయాలు తీసుకుని ప్రజల్లో నిలిచారన్నారు. భాజపా సభ్యత్వాల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం భాజపాలో జర్నలిస్టు సాయిరామ్, సంఘ సేవకుడు శివ లకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోలపర్తి శ్రీను ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు రాము అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ఇంఛార్జ్ పాక సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు పొనగంటి అప్పారావు , జోనల్ ప్రభారి పూడి తిరుపతిరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు దుప్పల రవీంద్రబాబు, పాలపాటి రవికుమార్, ముగరాల సురేష్, ఓబిసి జిల్లా అధ్యక్షులు బంగారు ఎర్రినాయుడు, వీరవల్లి సుధాకర్, గంగుపాం నాగేశ్వరరావు, భక్త సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వైస్ ఛాన్సలర్ పి.వి.జి.ప్రసాద్‌రెడ్డికి వైయస్ఆర్ స్టూడెంట్ యూనియన్ శుభాకాంక్షలు



విశాఖపట్నం : నూతన వైస్ ఛాన్సలర్ పి.వి.జి.ప్రసాద్‌రెడ్డికి వైయస్ఆర్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో 'కంగ్రాట్స్ సార్' అని భారీ బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వైస్ ఛాన్సలర్ విద్యారంగ అభివృద్ధికి తోడ్పడాలని, విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన ప్రతి ఒక్కరికి హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు బి.కాంతారావు, హెచ్‌యు అధ్యక్షులు బి.మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, రాష్ట్ర కార్యదర్శులు ఎం.కల్యాణ్, ఎం.సురేష్, ధీరజ్, విద్యార్థి గాయకులు సుదీర్‌పాల్, క్రాంతి కిరణ్, సాయికృష్ణ, పవన్, నిషేక్, సంజీవ్, విజయకృష్ణ, కుమార్, త్రినాధ్, ఆనంద్, ప్రశాంత్, అశోక్ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమంగా మొక్కలు నాటే కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్



విజయనగరం : అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రాణవాయువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. హరిత విజయనగరం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముడిదాం ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రాధమిక హక్కుగా భావించి ప్రతీ పౌరుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జీవకోటికి ప్రాణా ధారం పర్యవరణ పరిరక్షణని పేర్కొన్నారు. ఆత్మశుద్ధితో మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తూ, వాటి ఫలాలను అనుభవించడం ద్వారా మానసిక ఆనందం, ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్టు అధికారులు జానకీరామ్, రాజశేఖర్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పందుల షూటర్స్‌కు రక్షణ కల్పించండి



**ఎస్పీని కోరిన ఎంహెచ్ఓ డా.ప్రణీత**

విజయనగరం : పందుల నియంత్రణలో భాగంగా షూటర్స్‌ను ఏర్పాటు చేసి పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని, పందుల పెంపకందారులు నియంత్రణ చర్యలకు ఆటంకం కలిగించకుండా పోలీసులు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ బి.రాజకుమారిని శుక్రవారం కార్పొరేషన్ ఎంహెచ్ఓ డా.ప్రణీత కలసి విజ్ఞప్తి చేశారు. పందులను పట్టణానికి దూరంగా తరలించమని పెంపకందారులకు సూచించినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని, ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని షూటర్స్ ద్వారా పందుల నిర్మూళనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ఎంహెచ్ఓ వినతిపై ఎస్పీ బి.రాజకుమారి సానుకూలంగా స్పందించారు. షూటర్స్‌కు, శానిటరీ అధికారు లకు పోలీసులను రక్షణగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పర్యా వరణ ఇంజనీర్ వెంకట రమణ కూడా పాల్గొన్నారు.

# సింహాద్రినాధునికి ఊంజల్ సేవ



సింహాచలం : సింహాద్రినాధునికి అర్చక స్వాములు ఊంజల్ సేవ బరంపూర్ దాసుని సేవలో భాగంగా శుక్రవారం నాడు ఘణంగా నిర్వహించారు. ప్రతీ యేడు దాసుడు సింహగిరికి తన బృందంతో విచ్చేసి నిత్యం ప్రత్యేక పూజలు సేవలు స్వామికి జరిపించటం పరిపాటి వివిధ సేవల్లో భాగంగా శుక్రవారం నాడు తమ బృందంతో కలిసి సింహాద్రి నాధునికి ఊంజల్ సేవ అత్యంత కనులవిందుగా జరిపించారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ శారదానదిలో దుంబిరి అప్పలరాజు అనే వ్యక్తి తన ట్రాక్టర్తో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని ముందస్తు సమాచారం రావడంతో ఎస్సై పి. నరసింహమూర్తి తన సిబ్బందితో దాడి చేయగా ఇసుక అక్రమ రవాణాదారుడు వేపాడ మండలం తరలించేందుకు జివిఎంసికి కెనాల్ సీతమ్మపేట మీదుగా ఇసుక ట్రాక్టర్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ,ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకుపాల్పడితే చట్టపరమైన కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

# పలువురు రోగులకు మంత్రి మల్లాడి పరామర్శ



యానాం : యానాం నియోజకవర్గానికి చెందిన పలువురు రోగులు అనారోగ్యంతో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు శుక్రవారం పరామర్శించారు పుదుచ్చేరి నుండి వచ్చిన ఆయన కాకినాడ అపోలో ఆసుపత్రి ,వినోదయ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత డాక్టర్లను వివరణ అడిగి తెలుసుకున్నారు.

# గ్రామ వాలంటీర్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

అనంతగిరి : అనంతగిరి మండల కేంద్రంలో మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ టీమ్ కోణాపురం, గుమ్మ,టోకురు పంచాయతీలో నుండి వచ్చిన గ్రామ వాలంటీర్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈటీములో అనంతగిరి పంచాయతీ విస్తరణాధికారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# వాహనాల అధిక వేగానికి స్పీడ్ లేజర్ గన్‌తో కళ్ళెం : జిల్లా ఎస్పీ బి.రాజకుమారి



విజయనగరం: జిల్లాలో జాతీయ రాష్ట్ర హైవే రోడ్లుపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలవేగాన్ని స్పీడ్ లేజర్ గన్‌తో గుర్తించి, నిరోధించాలని, రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని జిల్లా ఎస్పీ బి. రాజకుమారి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో భోగాపురం, గజపతినగరం, సాలూరు, పార్వతీపురం, బబ్బిలి, విజయనగరం రూరల్, విజయనగరం ట్రాఫిక్, కొత్తవలస, ఎస్.కోట, చీపురుపల్లి సర్కిళ్ళు నుండి ఇద్దరు కానిస్టేబుళ్ల చొప్పున ఎంపిక చేసి, స్పీడు లేజర్ గన్‌ల వినియోగంపై జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ - రాష్ట్ర పోలీసు విభాగం నుండి జిల్లా పోలీసు కేంద్రంకు నాలుగు స్పీడు లేజర్ గన్‌లను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ స్పీడు గన్‌లను వినియోగించి జాతీయ, రాష్ట్ర రహదారులపై మితిమీరిన వేగంతో, నిబంధనలను అతిక్రమించి వస్తున్న వాహనాలను గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం వలనే జరుగుతున్నాయని, పరిమితికి మించిన వేగంతో వేళ్ళే వాహనాలకు స్పీడు గన్‌లతో కళ్ళెం వేయాలన్నారు. ఈ స్పీడు లేజర్‌గన్‌ల వినియోగంపై విజయవాడ పోలీసు కార్యాలయంలో శిక్షణ పొంది, నైపుణ్యం కలిగిన ఇద్దరు కానిస్టేబుళ్ళు సత్యన్నారాయణ, మాదవ్‌ల పర్యవేక్షణతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి, మిగిలిన కానిస్టేబుళ్ళకు స్పీడు లేజర్ గన్‌ల వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. శిక్షణలో స్పీడ్ లేజర్ గన్‌లను ఏ విధంగా వినియోగిస్తారు, దానితో వాహనాల వేగాన్ని ఏ విధంగా లెక్కిస్తారు, వేగంతో వచ్చిన వాహనాలను ఏవిధంగా గుర్తించాలి, వాటిని ఎలా అదుపు చెయ్యాలి, వారిపై చర్యలు ఎలా తీసుకోవాలన్న విషయంపై శిక్షణ ఇచ్చినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై అధిక వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి, మోటారు వాహన చట్టం ప్రకారం అపరాధ రుసుంలను విదిస్తామన్నారు. స్పీడు లేజరు గన్‌ల వినియోగం వలన రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో జాతీయ మరియు రాష్ట్ర రహదారులు ఉన్నటువంటి విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషన్, భోగాపురం, పెదమానాపురం పోలీసు స్టేషన్‌లలో ఈ స్పీడ్ లేజర్ గన్‌లు వినియోగంలోకి తేనున్నట్లుగా ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.నర్సింహారావు, ఎస్బీ సిఐ వై.వి. శేషు, డిసిఆర్‌బి సిఐ వి.వెంకట అప్పారావు, ఆర్ఐ రామకృష్ణ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వాలంటీర్ల నియామకం



విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశించిన కాలపరిమితి లోపు వార్డు వాలంటీర్ల నియామకాన్ని పూర్తి చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ అన్నారు. వార్డు వాలంటీర్ల ఇంటర్వ్యూలు శుక్రవారం కూడా కొనసాగాయి. అధికారులు నాలుగు ఫ్యానల్స్‌గా ఏర్పడి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం ఇంటర్వ్యూలకు హాజరు కావాలని 248 మందికి మేసేజ్‌ల రూపంలో సమాచారాన్ని అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నాటికి ఇంటర్వ్యూల ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఎంపికైన వాలంటీర్లను ఆగస్టు 1వ తేదీన ప్రకటిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆగస్టు 15 నుండి వాలంటీర్లు తమ విధులను నిర్వర్తిస్తారన్నారు. అలాగే వార్డు సచివాలయాల ఏర్పాటు కొరకు ప్రతీ వార్డులో భవనాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వార్డు మ్యాపింగ్‌ను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ రోజావెంకటరమణి, టిపిఓ కనకారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల నుంచి గ్రీవెన్సీ స్వీకరణ



విజయనగరం : తాను చేస్తున్న ఉద్యోగం కంటే ఉద్యోగం వచ్చిందన్న సంతోషంతో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి వేరొక ఉద్యోగంలో చేరిన ఒక దివ్యాంగ మహిళకు అనుకోని విధంగా ఎదురుదెబ్బ తగిలింది. ఆమె శశుక్రవారం కలక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్సు సెల్‌కు వచ్చింది. ముందు ఇచ్చిన ఉద్యోగానికి రాజీనామా చేసానని..తదుపరి వచ్చిన ఉద్యోగంలో చేరేందుకు వెళితే పోస్టింగు ఇవ్వలేదని వాపోయింది. దాంతో జిల్లా కలెక్టర్ ముందు చేస్తున్న ఉద్యోగంలో మరలా జాయిన్ అయ్యేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పరాష్కారం అయ్యే సమస్యలు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని లేదంటే తగిన కారణాలు తెలపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంటి అద్దె పాలసీ అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలని, అవుట్‌సోర్స ఉద్యోగుల జీతాలు పెండింగ్‌లో ఉన్నవి చెల్లించాలని పలువురు వినతులు ఇచ్చారు. ఇంక్రిమెంటు, ఎఫ్ఐసి పాలసీ, అలవెన్స్‌లు, టైమ్‌ఎస స్కేల్, నాల్గవ తరగతి ఉద్యోగుల ఇళ్ళ స్థలాల సమస్య ఇలా 159 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు.

# స్వచ్ఛత అందరి బాధ్యత

## కమిషనర్ ఎస్.ఎస్.వర్మ



విజయనగరం : పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరూ సహకరిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ అన్నారు.

రోజువారీ పారిశుద్ధ్య తనిఖీల్లో భాగంగా శుక్రవారం గెడ్డవీధి, కొనిస వీధి, బాబామెట్ట, వైఎస్ఆర్‌నగర్, పూల్‌భాగ్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమంపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటారో అదేవిధంగా తమ వీధిని, తమ కాలనీని ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి కార్పొరేషన్ వాహనాలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతలో గుర్తు తెలియని మహిళా మృతదేహం



విశాఖ క్రైం : పెందుర్తి మండలం పినగాడి వద్దనున్న సివిల్ సప్లై గోడౌన్ సమీపంలోరైల్వే ట్రాక్ రైల్వే ట్రాక్ కు అనుకుని ఉన్న గుంతలో మహిళా మృతదేహాన్ని విశాఖ grp పోలీసులు శుక్రవారం సాయంత్రం కనుగొన్నరు. ఈ మహిళ వయస్సు సుమారు (50) 50 సంవత్సరాలు... ఎత్తు 5 అడుగులు, ఉండవచ్చని జి ఆర్ పి ఎస్ ఐ బాలకృష్ణ తెలియజేశారు. మహిళ రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి పోయి ఉండవచ్చు అని అన్నారు. మృతురాలు కు రెండు కాళ్లు విరిగిపోయి ఉన్నాయ. ఆమె చేతులకు రాగి గాజులు ఉన్నాయి. మృతురాలి మొఖం పూర్తిగా పురుగుల పట్టడంతో ఆమెను గుర్తుపట్టడం కష్టంగా ఉందని అన్నారు. ఆమె ఎరుపు జాకెట్టు ధరించి ఉందని అన్నారు . ఈమె మృతి చెందింది సుమారు మూడు రోజులు పైగానే ఉంటుందని తెలిపారు.ఎవరి ఇంటిలోన అయినా సరే మహిళ కనిపించక పోతే విశాఖపట్నం జి .ఆర్ .పి పోలీసులను సంప్రదించాలని,ఎస్సై బాలకృష్ణ తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో ఆరు ఏడు తరగతులకు ఎంట్రన్స్ పరిక్ష ఆగస్టు 13

భీమునిపట్నం: విశాఖ జిల్లా ఆంధ్రప్రదేశ్ గురుకుల పాటశాలలు భీమిలి (బాలికలు), నర్సీపట్నం(బాలురు), అచ్యుతాపురం (బాలికలు) లలో 2019- 20 విద్యా సంవత్సరంనకు ఆరు ఏడు తరగతులలో బ్యాక్ లాగ్ ఖాళీ లను పూరించడానికి పరీక్ష నిర్వహిస్తున్నామని విద్యార్ధులు పరీక్ష కొరకు అన్ లైన్ లో htpp://aprjdc.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలని అన్ లైన్ దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 22 నుండి ఆగస్టు 1 వరకు అందుబాటులో ఉంటాదని భీమిలి గురుకుల పాటశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంటన్స్ పరీక్ష ఆగస్టు 13 భీమిలి గురుకుల పాటశాల జరుగుతాదని ఆయన తెలిపారు.

## సింహాచలంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్

సింహాచలం : 72 వ వార్డు పరిధి సింహాచలంలో శ్రీ నర సింహాయువజనసేవాసంఘం అద్యక్షుడు మరియు కో ఆపరేటివ్ బ్యాంకు కర్రి అప్పలస్వామి మరియు గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 21 వ తేదీ ఆదివారంనాడు సింహాచలం శ్రీ శ్రీనివాస కళ్యాణమండపంలో ఆ ర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఈ క్యాంపుకి మై క్యూర్ హాస్పిటల్ డాక్టరు పి రవికుమర్ ఎండీ డి ఎం కార్డియాలజి మరియు డాక్టరు బ్రహ్మాజీ జనరల్ వారిచే ఉచితంగా ఈసీజీ 2 డి ఎకో షుగర్ బీపీ మొదలగు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వబడునని కావున ఈ అవకాశాన్ని ప్రతివక్కరు ఉపయోగించుకోవాలని ఆర్గనైజర్ గ్రామీణ వైద్యులసంఘం సెక్రటరీ లోగిశ గణేష్ ఇతర నిర్వహకులు కోరారు.

## మంత్రిమోపిదేవిని కలిసిన పెదముషిడివాడ వైసిపిశ్రేణులు



పరవాడ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర మత్స్యశాఖ , పశుసంవర్ధక శాఖా మంత్రివర్యులు మరియు విశాఖపట్నం ఇంచార్జిమంత్రివర్యులు మోపిదేవి వెంకటరమణను శుక్రవారము పరవాడమండలము పెదముషిడివాడ వైసిపినాయకులు యమ్ .కిరణ్ చందు, పల్లాఅప్పారావు,ఎమ్ .వినోద్ ,కె.సత్యనారాయణ,కన్నూరుకుచెందినఅశోక్ ,జి.శ్రీను తథితర్లు మర్యాదపూర్వకంగా కలిసి హర్ధికశుభాకాంక్షలు తెలిపారు. అనంతరము యమ్ .కిరణ్ చందు,పల్లాఅప్పారావు మాట్లడుతూపెదముషిడివాడగ్రామఅభివృద్ధికి తమవంతు సహయసహకారాలు అందజేయాలనీ కోరారు.

## అన్నవరంలో పందులు బెడద



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో పందులు సంచారము ఎక్కువగా ఉండడంతో ఇక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురి అవుచున్నారు.ముఖ్యంగా వానలు కురిసే సమయంలో పందులు సంచారము వలన మెదడువాపు వ్యాది వస్తుందని ఇక్కడ ప్రజలు భయపడుచున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ యువకుడు మృతి



యు :కొత్తపల్లి: మండలంలో గురువారం అర్ధరాత్రి శీలం వారి పాలెం సమీపంలో గుర్తుతెలియని వాహనం యువకుడిని ఢీకొట్టింది కొట్టింది అక్కడికక్కడే యువకుడు మృతిచెందాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ జెడ్ సమీపంలో కూలి పని ముగించుకొని స్వగ్రామం శ్రీరాంపురం వెళ్తున్న పేరూరి కనకయ్య(30) మృతి చెందాడని ఈ ఘటన పై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి కొత్తపల్లి ఎస్ ఐ పార్థసారథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాడీ ని పిఠాపురం ఆస్పత్రికి తరలించారు.

## ప్రభుత్వ ఆసుపత్రి లో యాంటి టిబి డే




భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రతి నెల మూడవ శుక్రవారం యాంటి టి బి డే బాగంగా స్థానిక కమ్యూనిటీ సెంటర్ లో సూపరెండెంట్ డాక్టర్ దిద్దే సిద్దార్ధ కుమార్ ఆద్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమం లో ఓ పి లో ఉన్న పేషెంట్స్ కి మరియు క్షయ వ్యాధి రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు.టి బి నిర్ధారణ ,టి బి నిర్మూలన గురించి జాగ్రత్తలు సూచించారు.ఇందులో బాగంగా పాలు మరియు గుడ్లు పంపిణి చేశారు.దీనిలో హెడ్ నర్స్ రమణమ్మ,డి పి యం ఓ ,ఎస్ టి ఎల్ ఎస్ ప్రేమ్ కుమార్ ,ఎస్ టి ఎస్ చక్రవర్తి ,టి,బి హెచ్ వి సత్యవతి లు పాల్గొన్నారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్య వచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి.సత్యనారాయణ ఆద్వర్యంలో కోంపెళ్ల.మూర్తికుచిబోట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో ఎంవి.సురేష్ బాబు, ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేసారు.

## చైల్డ్ లైన్‌పై అవగాహన



యానం: కేంద్ర పాలిత ప్రాంతమైన యానం నియోజకవర్గంలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ సిబ్బంది రాత్రిపూట చైల్డ్ లైన్ అందిస్తున్న కార్యక్రమాల పై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు స్థానిక త్యాగరాజ వీధిలో గల పలు వ్యాపారాలు, గృహాల వద్ద 1098 అందించవలసిన సమాచారం పై అవగాహన కలిపించారు బాలలను కొట్టడం లేదా వేధించడం, తదితర రకాలుగా వేదింపులకు గురి అవుతున్న వీధి బాలలను చూసి నప్పడు ప్రతి ఒక్కరూ వాలంటీర్ గా చైల్డ్ లైన్ కు మీ సేవలు అందించాలిని చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తున్నారు.

బాల్య వివాహాలు మైనర్ బాలికపై అగాయిత్యం పిల్లల సంరక్షణ తదితర కార్యక్రమాలపై చైల్డ్ లైన్ సిబ్బంది శ్రీదేవి తదితరులు అవగాహన కలిపిస్తునారు

## ద్రోణంరాజుకు అప్పన్న వేదపండితుల ఆశీర్వాదం




విశాఖపట్నం: వి ఎం ఆర్ డి ఏ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన ద్రోణంరాజు శ్రీనివాస్ కు సింహాచలం దేవస్థానం వేదపండితులు తమ ఆశీర్వాదం అందజేశారు.

వుడా చిల్డ్రన్ థియేటర్లో జరిగిన కార్యక్రమంలో వేద మంత్రోచ్చారణలు.. మృదు మధుర మంగళవాయిద్యాల మధ్య.. వేద పండితులు ద్రోణంరాజు కు ఆశీర్వాదం తో పాటు ప్రసాదాలను అందజేశారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు.,.అప్పన్నఫోటో ను బహుకరించి అభినందనలు తెలిపారు. వైయస్ఆర్ సీపీ నాయకులు బెహరా భాస్కరరావు, కర్రీ సత్తిబాబు, కంపర సత్తిబాబు, గునిశెట్టి శ్రీనివాసు, గంట్ల కిరణ్ బాబు, రాజు... కోటి .. సింహాచలం ప్రాంత వైసిపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## భీమిలికి గోదావరి జలాలు తేవాలి

### గంటా నూకరాజు డిమాండ్



భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి కారణంగా ప్రజలు విలవిలలాడుతున్నారని భీమిలి టిడిపి డివిజన్ గంటా నూకరాజు తెలియజేసిరి. శుక్రవారం భీమిలి టిడిపి కార్యాలయం లో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంనగరంలో గోదావరి జలాలు, రైవాడ, ముడసరలోవ, గంభీరం, ఏలేరు కాలువల నుండి మంచినీరు సరఫరా చేసి అక్కడ ప్రజలకు దాహార్తిని తీరుస్తున్నారని. భీమునిపట్నం మున్సిపాలిటీ ని విశాఖపట్నం గ్రేటర్ లో విలీనం చేసిన తరువాత విశాఖ గ్రేటర్ ప్రజలకు ఉన్న సదావకాశాన్ని అనకాపల్లి, భీమిలి ప్రజలకు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని . గోదావరి జలాలు భీమిలి కి దగ్గరలో ఉన్న ఐ.ఎన్. ఎస్. కళింగ వరకు వచ్చాయని ఇంకో 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిలి ప్రాంతానికి ఈ గోదావరి జలాలను పొడిగించినట్లయితే బాగుంటుందని. భీమిలి ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నప్పటికీ కుళాయిలు రెండు రోజులకు ఒకసారి సప్లై చేస్తున్నారని . వాటర్ ట్యాంకుల ద్వారా సప్లై చేస్తున్నప్పటికీ ఇంకా కొరతగా ఉన్నదాని భీమిలికి సామ్యవలస, గోస్తనీ నుండి వాటర్ సప్లై చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలు తీర్చడంలో కొంత ఇబ్బంది ఏర్పడుతోందని . సామ్యవలస, గోస్తనీ మరియు తాటిపూడి రిజర్వాయర్ల నుండి నీరు ప్రవహించే ప్రాంతంలో వాటర్ స్టోరేజ్ కోసం చెక్ డ్యామ్ లు కట్టినట్లయితే వాటర్ స్టోరేజ్ అయి భావితరాల వారికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి భీమిలి ప్రజల దాహార్తిని తీర్చే విధంగా తగు చర్యలు తీసుకోవలని

అదేవిధంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయి రెండు నెలలు గడుస్తున్నా భవన నిర్మాణాలకు సంబంధించి ఇసుక విషయంలో కొత్త నిబంధనలు తీసుకొస్తామని, త్వరలో విధి విధానాలు ప్రకటిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం వలన చాలా ఇబ్బంది పడుతున్నారని. భవన నిర్మాణం జరగక పోవడం వలన వేలాదిమంది కార్మికులు రోడ్డున పడుతున్నారని, దీని కారణంగా అనుబంధంగా ఉన్న రాడ్ బెండింగ్, ప్లంబర్, ఎలక్ట్రికల్ మరియు తదితర పనులు జరగక పోవడం వలన వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయని ఇసుక కొనుగోలు విషయంలో ప్రభుత్వం సరైన మార్గదర్శనాలను విడుదల చేసి ఏ జిల్లాకి ఆ జిల్లా కలెక్టర్ లకి బాధ్యతలు అప్పగించి ప్రజల యొక్క కష్టాలను అర్ధం చేసుకోవాలని డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కంచెర్ల కామేష్, గండిబోయిన పోలిరాజు, సంకురుబోతు జోగారావు, వియ్యపు పోతురాజు, కె.ఎస్.ఆర్.కృష్ణారావు, కందుల సుందర్ రావు, పైడిపల్లి నర్సింగరావు, రాజగిరి రమణ, మట్టా దాసు, గూడుపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## గీతం విద్యార్ధులకు 'మైక్రోసాఫ్ట్ ' బంపర్ ఆఫర్


### రూ. 10.87 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు




విశాఖపట్నం: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2019-20 విద్యాసంవత్సరం శుభారంభంతో మొదలయింది. ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్ధులకోసం ప్రముఖ కంపెనీలు బారులు తీరాయి. మొదటగా గీతంలో ప్రాంగణ నియామకాలు చేపట్టిన ప్రపంచ ప్రసిద్ధ ఐటి రంగ సంస్థ మైక్రోసాఫ్ట్ ముగ్గురు విద్యార్ధులకు ప్రిమియర్ ఫీల్డ్ ఇంజనీర్, ప్రాజెక్ట్ మేనేజర్, అసోసియేట్ కన్సల్టెంట్ ఉద్యోగాలను ఆఫర్ చేసింది. రెండు రోజుల క్రిందట గీతంలో ఈ ప్రాంగణ నియామకాలను చేపట్టిన మైక్రోసాఫ్ట్ ఇండియా యూనివర్సిటీ రిక్రూటింగ్ టీమ్ వివిధ దశలలో ఇంటర్వ్యూలను నిర్వహించింది. చివరిగా గీతం విద్యార్ధులు జె.వి.ఎమ్.అమూల్య, ఎస్.సాయి చరణ్, ప్రవీణ్ సాయి సదాశివలను ఎంపిక చేసినట్లు గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం డైరక్టర్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు.మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగాలకు ఎంపికయిన విద్యార్ధులకు రూ. 10.87 లక్షల రూపాయలను వార్షిక వేతనంగా అందించనున్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న 20 మంది తృతీయ సంవత్సరం విద్యార్ధినులను ఇప్పటికే మైక్రోసాఫ్ట్ వైజ్ (ఉమెన్ ఇన్ సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌కు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు.రెండు బ్యాచ్‌ల విద్యార్ధినులను మైక్రోసాఫ్ట్ వైజ్ ఎంపిక చేసుకోవడం విశేషమన్నారు. ఇటీవలె గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్ధులు సబ్ లెఫ్టనెంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు భారత నౌకాదళం ఎంపిక చేసింది.

కాగా ఎంపికయిన విద్యార్ధులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ శుక్రవారం న అభినందించారు.

## యూనియన్ బ్యాంక్ జిఎమ్ గీతం సందర్శన



విశాఖపట్నం: ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఇండియా కార్యకలాపాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించడానికి ఫీల్డ్ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు శుక్రవారంన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. గీతంతో అనుబంధం తమకు ప్రత్యేకమైనదని ఆయన పేర్కొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో అగ్ర శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతంను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో దాదాపు 20వేల మందికి పైగా విద్యార్ధులు గీతంలో ఉన్నత విద్యా అభ్యసిస్తున్నామని తెలిపారు. త్వరలో వ్యవసాయ సంభంద కోర్సులను ప్రారంభించే ఉద్దేశ్యంలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాస్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో గీతం సంయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, గీతం కార్యదర్శి బి.వి.మోహనరావు, గీతం హైదరాబాద్ ప్రాంగణ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, గీతం చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎన్.వి.ఎన్.రాంమ్‌సాయి, గీతం చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గోపాలకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాదికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోకం శ్రీనివాస్ జన్మదినోత్సవ వేడుకలు







సబ్బవరం: అనంతరం బోకం శ్రీనివాస్ స్వగ్రామం తవ్వవనిపాలెంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమలలో భాగంగా ప్రముఖ సినీ గాయనీ మంగ్లీ, టీవీ ఆర్టిస్ట్ విష్ణు ప్రియా నృత్యంతో యువతను ఉర్రుతలూగించారు. ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సహకాలు అందజేయసారు. ఈ కార్యక్రమంలో బోకం శ్రీనివాస్ తల్లిదండ్రులు బోకం అప్పల నాయుడు( సర్పంచ్ ),నారాయణ మ్మ, మహా నగర వైస్సార్సీపీ అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శరగడం చిన్న అప్పల నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్ రెడ్డి, ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త కె కె రాజు, రాష్ట్ర కార్యాదర్శి చొక్కాకుల వెంకట రావు, వెంపడ శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ చొక్కాకుల గోవిందు, జిల్లా బీ సీ సెల్ అధ్యక్షులు కోటాన రాము, సబ్బవరం మాజీ ఎం పి పి సబ్బవరపు ముత్యాల నాయుడు, మండల అధ్యక్షులు తుంపాల అప్పారావు, బోకం రాము నాయుడు, వనం అచ్చి0 నాయుడు, కోటాన వెంకట రమణ, పైలా రమణ, మరియు గ్రామ పెద్దలు, అభిమానులు, కార్యకర్తలు, శ్రీనివాస్ యూత్ సభ్యులు పాల్గున్నారు



ప్రముఖ వ్యాపార వేత్త, సంఘ సేవకుడు, బోకం శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు మురళీ నగర్ లో వున్నా అయన నివాసంలో ఘనంగా నిర్వహించరు. ఇందులో భాగంగా వైస్సార్ సీపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి చొక్కాకుల వెంకట రావు, సీనియర్ నాయకులు వెంపడ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ చొక్కాకుల గోవింద్, మురళీ నగర్ వెలమ సంఘ0 నాయకులు, యువసేన నాయకులు ఆదిరెడ్డి చలపతి, వనం ఆదిత్య నాయుడు, తార కామేష్, 38 వార్డ్ నాయకుడు గుళ్ళుపల్లి చంద్ర మౌళి, బాగాది విజయ్, తదితరులు హాజరై బోకం శ్రీనివాస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.







# ఏయూ వీసీగా ఆచార్య ప్రసాద రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ





విశాఖపట్నం: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు పి.వి.జి.డి ప్రసాదరెడ్డి శుక్రవారం మద్యాహ్నం 1.20 గంటలకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా అదనపు బాధ్యతలను చేపట్టారు. ఆచార్య ప్రసాద రెడ్డికి ఏయూ బాధ్యతలు అప్పగిస్తూ రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. అధికారికంగా ఆచార్య ప్రసాదరెడ్డి నేడు శు క్రవారం మధ్యాహ్నం పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఆచార్య ప్రసాద రెడ్డి నిరాడంబరంగా తన సొంత కారులో తానే స్వయంగా నడుపుకుని వర్సిటీకి చేరుకున్నారు. అక్కడ ముందుగా ఏయూ పరిపాలనా భవననిర్మాణానికి వేసిన 1942 నాటి శిలాఫలకం వద్ద పుష్పాలను ఉంచారు. అనంతరం వర్సిటీలో ఉన్న స్వర్గీయ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర రెడ్డి, మహాత్మగాంధీ, మహాత్మ జ్యోతారవు పూలే, బి.ఆర్ అంబేద్కర్, వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, ఏయూ చిహ్నాలకు పూలు ఉంచారు. అనంతరం నేరుగా కార్యాలయానికి చేరుకున్నారు.

మాజీ వీసీ ఆచార్య బీల సత్యనారాయణ సమక్షంలో వర్సిటీ వీసీగా ఆచార్య ప్రసాద రెడ్డి 1.20 గంటలకు పదవీ బాధ్యతలను చేపట్టారు. తనను తీర్చిదిద్దిన అక్క డాక్టర్ పి.ఏ.ఎల్ రజని పక్కనే ఉండి తన సోదరునికి శుభాకాంక్షలు అందించారు. అనంతరం వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.బైరాగి రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిఎస్ఎన్ఎల్యూ మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, రమణ మూర్తి, ఎస్.సుమిత్ర, టి.వినోద రావు, అకడమిక్ డీన్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, సెనేట్ సభ్యులు కుమార్ రాజ, పాలక మండలి పూర్వ సభ్యులు సురేష్ చిట్టినేని తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు అవకాశం అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి గారికి, విజయసాయి రెడ్డిగారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అత్యుత్తమమైన విశ్వవిద్యాలయంగా విరాజిల్లుతూ, ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలపాలని, దేశంలోనే నెంబర్ 1 వర్సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతీ విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం తమ లక్ష్యమన్నారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు అందించడం, క్యాంపస్‌లో ఉద్యోగాలుకల్పించే దిశగా పనిచేయడం జరుగుతుందన్నారు.

వర్సిటీలో సేవా కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి వెంటనే కృషిచేస్తామన్నారు. జాతీయ విద్యా సంస్థలు అనుసరిస్తున్న అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తామన్నారు. రానున్న 10 సంవత్సరాలలో వర్సిటీలో చేసే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికను త్వరలో తెలియజేస్తానన్నారు. తాను మాజీ వీసీ ఆచార్య బీల సత్యనారాయణ, ఐఏఎస్ అధికారి ఎం.జి గోపాల్‌ల దగ్గర నుంచి తాను ఎంతో నేర్చుకున్నానన్నారు. వర్సిటీలో ప్రతీ విభాగంపైన తనకు అవగాహన ఉందన్నారు. 32 సంవత్సరాల తన అధ్యాపక ప్రయాణంలో తనకు మంచి మిత్రులు తన విద్యార్థులేనన్నారు. విద్యార్థిగా వచ్చి వారి మధ్యనే నేను ఎదిగానని తెలిపారు. వర్సిటీలో ప్రతీ విద్యార్థికి తన పిల్లల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యతను ఏయూ తీసుకుంటుందని, దీనికి మీడియా సహకారం సైతం ఎంతో అవసరమన్నారు.

ఉత్తరాంధ్రలో ప్రతీ సమస్యపై వర్సిటీ పరంగా పరిష్కారాలను సూచిస్తామన్నారు. సామాజిక అభివృద్ధికి ఏయూ కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్యలు, విశాఖలోకాలుష్యం వంటి అంశాలపై తాము పనిచేస్తామన్నారు.

ఇప్పటికే వర్సిటీలో బోధన ఖాళీల భర్తీకి అనుమతులు లభించాయన్నారు. వర్సిటీలో ఉన్న సమస్య ఆచార్యుల కొరత కాదన్నారు. ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాలు తమ కంటే తక్కువ మంది బోధన సిబ్బందితో నిర్వహించడం జరుగుతోందన్నారు.

దీనికంటే పెద్ద సమస్య నిధుల కొరతన్నారు. తమ వర్సిటీకి రావలసిన నిధులు పసుపు కుంకుమ పేరుతో తరలిపోయాయని వీటిని వెనక్కి తెచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. పేద విద్యార్థులకు ఏయూ అండగా నిలుస్తుందన్నారు. వర్సిటీలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ఆచార్య ప్రసాదరెడ్డి వద్ద పరిశోధన మార్గదర్శకం పొంది డాక్టరేట్‌లు సాధించిన విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు, ఆచార్యులు, పరిశోధకులు, పెద్దసంఖ్యలో హాజరై శుభాకాంక్షలు అందజేశారు.



# సింహగిరి శ్రీ త్రిపురాంతక ఆలయంలో వరుణయాగం



సింహాచలం: సింహాద్రి నాథుని ఉపాలయం సింహగిరిపై వెంచేసియున్న శ్రీ త్రిపురాంతక స్వామి ఆలయంలో నేటినుండి వరుణయాగం జరపనున్నట్టు సింహాచలం దేవస్థానం అధికా రులు తెలియజేశారు. రాష్ట్రంలో తీవ్రవర్షాబావ ప్రభావంతో అనావృష్టి నివారణార్థమై వర్షాలు సమృద్ధిగా కురవాలని భారతదేశం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవదాయ శాఖ అధికారుల అదేశాలమేరకు మూడు రోజుల పాటు సింహగిరి త్రిపురాంతకాలయంలో వరుణయాగం జరపనున్నట్టు మొదటిరోజు ఉదయం 5 గంలకు గణపతిపూజ పుణ్యాహవచనం పరిషత్ ఋత్విక్ గ్వరణం దీక్షాధారణ మండపారాధన కళ స వాహనం వరుణమంత్ర జపములుతో ప్రారంభమై వివిద కార్యక్రమముల అనంతరం 22 వ తేదీన చివరిరోజున మహాపూర్ణహుతితో ఈ యాగం పరిసమాప్తి అవుతుందని కనుక ఈ యాగంలో భక్తులు పాల్గొనాల్సిందిగా అదికారులు కోరారు








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com